

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 06 జూలై 2021 సంపుటి : 02 సంచిక :344 పేజీలు : 4 వెల : రూ 3-00


## కేంద్రమంత్రులు షెకావత్, ప్రకాష్ జవదేకర్‌కు సీఎం జగన్ లేఖ



అమరావతి: కేంద్రమంత్రులు గజేంద్ర షెకావత్, ప్రకాష్ జవదేకర్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరుగా లేఖలు రాశారు. తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తోందంటూ మరోసారి సీఎం వైఎస్ జగన్ ఫిర్యాదు చేశారు. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న అక్రమ ప్రాజెక్టులను సందర్శించాకే.. రాయలసీమ లిఫ్ట్ సందర్శించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ని ఆదేశించాలని సీఎం వైఎస్ జగన్ కోరారు.నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని.. కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని వినియోగిస్తోందని సీఎం జగన్ లేఖలో పేర్కొన్నారు. "శ్రీశైలం ప్రాజెక్టులో నీటినిల్వలు ఉండకుండా తెలంగాణ అక్రమంగా నీటిని తోడేస్తోంది. ఈనెల 1 నుంచి ఇప్పటి వరకు 19 టీఎంసీల నీటిని వినియోగించుకుంది. 796 అడుగుల నీటిమట్టం నుంచి తెలంగాణ నీటిని తోడేస్తోందనివవ సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు.తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను పట్టించుకోకుండా రాయలసీమ లిఫ్ట్‌ను పరిశీలిస్తామని పదేపదే కేఆర్ఎంబీ కోరుతోంది. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న అక్రమ ప్రాజెక్టులను సందర్శించాకే రాయలసీమ లిఫ్ట్ సందర్శించేలా కేఆర్ఎంబీని ఆదేశించాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.తెలంగాణ పాలమూరు-రంగారెడ్డి, దిండి, కల్వకుర్తి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని, కేంద్ర జలశక్తి, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అనేక ఫిర్యాదులు చేసినా సరైన చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఏపీ పట్ల కేఆర్ఎంబీ వివక్షతో వ్యవహరిస్తోందని, తెలంగాణ తప్పుడు ఫిర్యాదుల పట్ల మాత్రం కేఆర్ఎంబీ వేగంగా స్పందిస్తోందన్నారు. ఏపీ ఇచ్చిన ధర్మబద్ధమైన ఫిర్యాదులను కేఆర్ఎంబీ పట్టించుకోవడంలేదని సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు. "శ్రీశైలంలో 854 అడుగుల నీరు లేకుంటే కరువు ప్రాంతమైన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించే అవకాశం లేదు. పాలమూరు రంగారెడ్డి, దిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను 800 అడుగుల వద్ద పర్యావరణ అనుమతి లేకుండా తెలంగాణ నిర్మిస్తోంది. ఈ అక్రమ ప్రాజెక్టు వల్ల శ్రీశైలంలో 854 అడుగుల నీరు ఉండే అవకాశాలు లేవనివవ సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు పర్యావరణ అనుమతి ఇవ్వాలని కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్‌కు రాసిన లేఖలో సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా ప్రాజెక్టుల్లో తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. "జూన్ 1 నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా పరిధిలో ఇరిగేషన్ అవసరాలు లేకుండా తెలంగాణ నీటిని వినియోగిస్తోంది.విద్యుత్ ఉత్పత్తి కోసమే ఇప్పటి వరకు 19 టీఎంసీల నీటిని వినియోగించింది. 854 అడుగులకు చేరితే గానీ పోతిరెడ్డిపాడుకు నీటిని తీసుకునే అవకాశం లేదనివవ లేఖలో సీఎం జగన్ పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఇప్పటికే కేంద్ర జలవనరుల కమిషనర్‌కు పూర్తి డీపీఆర్‌ను అందజేశామని.. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో సీఎం జగన్ పేర్కొన్నారు.

## నిరుద్యోగ యువతతో రేపు, ఎల్లుండి పవన్ సమావేశాలు

అమరావతి: రేపు, ఎల్లుండి నిరుద్యోగ యువతతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమావేశాలు అవుతారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ తెలిపారు. ముఖ్య నాయకులతో భేటీలో పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లుండి పీఏసీ సమావేశంలో చర్చించి రోడ్ మ్యాప్‌ను పవన్ ప్రకటిస్తారని చెప్పారు. నిరుద్యోగ యువతతో పవన్ సమావేశం అవుతారన్నారు. సీఎం జగన్ జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్ లెస్ క్యాలెండర్ ప్రకటించారన్నారు. ఇప్పుడు జల వివాదాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ ఎందుకు కూర్చొని చర్చించడం లేదు? అని ప్రశ్నించారు. అమరావతినే ఏకైక రాజధాని అనేది జనసేన మొదటి నుంచీ చెబుతోందని దీనికే కట్టుబడి ఉన్నామని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.



## టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌ను బాబు నియమించారనడంపై సుజాత ఆగ్రహం

అమరావతి: వైసీపీ ప్రభుత్వం, నేతలపై మాజీ మంత్రి పీతల సుజాత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గడిచిన ఐదేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తే.. నేడు రెండేళ్ల వైసీపీ పాలనలో ఫస్ట్ తారీఖు వస్తుందంటే ఉద్యోగుల జీతాలకు అప్పు ఎక్కడ దొరుకుతుందా అని ప్రభుత్వం పరుగులు తీస్తుందని అన్నారు. పొరుగు రాష్ట్రం అక్రమంగా నీటిని విద్యుత్‌ను వాడుకుంటూ ఆంధ్రప్రదేశ్‌కి నష్టం చేస్తూ, తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైన విమర్శలు చేస్తున్నా కూడా స్పందించరని మండిపడ్డారు. "కానీ...టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డిని చంద్రబాబు నియమించారని వైసీపీ నేతలు మాట్లాడటం, ఇలాంటి చవకబారు విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనంవవ అని పీతల సుజాత అన్నారు.



## కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ప్రభుత్వం మరో లేఖ

హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి వివాదాల నేపథ్యంలో కృష్ణా నది యాజమాన్య బోర్డుకు రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ మరో లేఖ రాశారు. ఈ నెల 9న తలపెట్టిన త్రిసభ్య కమిటీ భేటీ వాయిదా వేయాలని బోర్డుకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20వ తేదీ తర్వాత పూర్తి స్థాయి బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జల విద్యుత్ ఉత్పత్తి ఆపాలన్న ఏపీ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు రజత్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అజెండాను లేఖలో పొందుపరిచారు. తెలంగాణ అంశాలను 20వ తేదీ తర్వాత జరిగే బోర్డు సమావేశం అజెండాలో చేర్చాలని కోరారు.ప్రధానంగా తెలంగాణ, ఏపీ మధ్య నీటి పంపకాలపై పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న రాయలసీమ, ఆర్డీఎస్ కుడి కాల్వ పనులు ఆపాలన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా బేసిన్ వెలుపలకు ఏపీ ప్రభుత్వం ఎక్కువ నీటిని తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు లభించడంతో తెలంగాణకు అదనంగా 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారు. తాగునీటి జలాలను 20 శాతంగానే లెక్కించాలని చెప్పారు. తెలంగాణ మిగులు జలాల లెక్కింపు వ్యవస్థ ఏర్పాటు చేయాలని రజత్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు.



## కేబినెట్ కసరత్తులు...

### ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు

విజయవాడ, జూలై 5, (న్యూస్ పల్స్) ప్రస్తుతం కరోనా కష్టకాలంలో రాజకీయాల గురించి పెద్దగా మాట్లాడుకోవడానికేం లేదు. అయితే మరో మూడు, నాలుగు నెలల్లో ఏపీ కేబినెట్ ప్రక్షాళన ఉండడంతో కేబినెట్‌లో ఎవరు కొత్తగా వస్తారు ? ఎవరు ఉంటారు ? ఎవరు వెళతారు ? ఇవే కాస్త గరంగంగా వినిపిస్తున్నాయి. ఈ సారి ఏయే జిల్లాల నుంచి ఎవరు వెళతారు ? ఎవరు కొత్తగా కేబినెట్లోకి వస్తారన్నదే హాట్ టాపిక్. అయితే కీలకమైన కర్నూలు జిల్లాలో ఈ సారి ఈక్వేషన్లు సెట్ చేయడం జగన్‌కు కత్తిమీద సాములా మారిందన్నది నిజం. తొలి టర్మ్ కేబినెట్ లో జగన్ జిల్లాలో రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీలకు చెరో పదవి ఇచ్చారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సీనియర్. ఆయన రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఈ వర్గంలోనే శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి లాంటి సీనియర్లు ఉన్నా సబ్జెక్ట్ ఉండడంతో పాటు ఆర్థిక వ్యవహారాల్లో మంచి పట్టు ఉండడం.. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీఏసీ చైర్మన్‌గా నాటి అధికార పార్టీ నేతలను ముప్పుతిప్పలు పెట్టడంతో జగన్ బుగ్గనకు కీలకమైన ఆర్థికశాఖ కట్టబెట్టారు.ఇక బీసీ కోటాలో ప్రజారాజ్యం పార్టీ నుంచి వైసీపీలోకి వచ్చి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యే అయిన గుమ్మనూరు జయరాంకు పదవి వచ్చింది. ఇప్పటి వరకు బాగానే ఉన్నా ప్రక్షాళనలో మాత్రం జగన్‌కు చాలా జిల్లాల్లో తలనొప్పులు ఉన్నట్టుగానే కర్నూలులోనూ తలనొప్పులు తప్పేలా లేవు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రుల్లో ఇద్దరిని కంటిన్యూ చేసే ఛాన్సులు అయితే లేవు. బుగ్గన కంటిన్యూ అవుతారనే ఎక్కువ మంది అంటున్నారు. బీసీ మంత్రిగా ఉన్న జయరాంను తప్పిస్తే మరో బీసీ ఎమ్మెల్యే లేరు. ఎస్సీ ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, డాక్టర్ సుధాకర్ ఇద్దరూ తొలిసారి రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేలు అయ్యారు. పైగా వీరిద్దరు అంత దూకుడుగా కూడా ఉండరు. ఎస్సీ కోటాలో వీరికన్నా మిగిలిన జిల్లాల్లో చాలా మంది సీనియర్లు ఉన్నారు. జయరాంను తప్పించి రెండో బెర్త్ ఇస్తే మళ్లీ రెడ్డి నేతకే ఇవ్వాల్సి ఉంది.మంత్రాలయంలో సీనియర్ నేత బాల నాగిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి బలమైన లాబీయింగ్ స్టార్ట్ చేసేశారు. ఈ ముగ్గురు నేతలు కూడా సీనియర్లే కావడంతో ఎవరికి వారే తమకే పదవి ఇవ్వాలంటున్నారు. సాయి ప్రసాద్ రెడ్డి, రెండు సార్లు, బాల నాగిరెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేలు. వీరిద్దరు సోదరులే కావడంతో అండర్ స్టాండింగ్‌తో ముందుకు సాగుతున్నారట. ఇక నంద్యాల ఉప ఎన్నిక టైంలో పార్టీలో చేరిన శిల్పా చక్రపాణి రెడ్డి తన ఎమ్మెల్సీ పదవిని కూడా వదులుకున్నారు. ఇప్పుడు ఆయన కూడా తనకు జగన్ నాడే మంత్రి పదవి ఇస్తానని హామీ చెప్పేసుకుంటున్నారు. మైనార్టీ కోటాలో అంజాద్ బాషాను తప్పిస్తే తనకే పదవి వస్తుందని కర్నూలు సిటీ ఎమ్మెల్యే మహ్మద్ హఫీజ్ ఖాన్ ప్రచారం చేసుకుంటున్నారు. జయరాంను తప్పిస్తే రెండో ఛాన్స్ కూడా జగన్ రెడ్లకే ఇస్తారా ? లేదా ఊహించని విధంగా మైనార్టీలకు ఇస్తారా ? అన్నది చూడాలి.

## ఇతర దేశాలకు అందుబాటులో కోవిన్ పోర్టల్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కోవిడ్‌పై పోరాటంలో టెక్నాలజీ కూడా సహకరించిందని, అదృష్టవశాత్తు సాఫ్ట్‌వేర్‌లో ఎటువంటి అవరోధాలు లేవని, అందుకే కోవిడ్ ట్రేసింగ్, ట్రాకింగ్ యాప్‌ను ఓపెన్ సోర్సుగా మార్చినట్లు ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలకు కోవిన్ పోర్టల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంటుందన్నారు. కోవిన్ యాప్‌తో వ్యాక్సినేషన్ ప్రక్రియ సక్సెస్ సాధించినట్లు ఆయన చెప్పారు. కోవిన్ గ్లోబల్ సమావేశంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహమ్మారి నుంచి సురక్షితంగా బయటపడేందుకు వ్యాక్సినేషన్ విధానం ఒక్కటే మానవళికి ఆశాకిరణం అన్నారు.మన దేశంలో ముందు నుంచి వ్యాక్సినేషన్ కోసం డిజిటల్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. అన్ని దేశాల్లోనూ కరోనా వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. గత వందేళ్లలో ఇలాంటి మహమ్మారిని చూడలేదన్నారు. ఏ దేశమైనా, అది ఎంత శక్తివంతమైనదైనా, ఇలాంటి సమస్యను పరిష్కరించం అసాధ్యమన్నారు.ఆరోగ్య సేతను యాప్ సక్సెస్ అయ్యిందని, 20 కోట్ల మంది ఆ యాప్‌ను వాడుతున్నట్లు ప్రధాని వెల్లడించారు. యావత్ ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా భారతీయ నాగరికత చూస్తుందని, మహమ్మారి వేళ ఈ తత్వాన్ని అందరూ అర్థం చేసుకున్నారని, అందుకే కోవిడ్ వ్యాక్సినేషన్ కోసం రూపొందించిన కోవిన్ టెక్నాలజీ ఫ్లాట్‌ఫామ్‌ను ఓపెన్ సోర్స్‌గా చేసినట్లు ప్రధాని తెలిపారు.



## ఏపీలో కర్ఫ్యూ సడలింపుల్లో మార్పులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ఫ్యూ సడలింపుల్లో పలు మార్పులు ప్రకటించింది. తాజా నిబంధనల ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 7 వరకు సడలింపు ఉంటుంది. సాయంత్రం 6 గంటలకే దుకాణాలు మూసివేయాల్సి ఉంటుంది. ఇక మిగిలిన 11 జిల్లాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు సడలింపునిచ్చిన ప్రభుత్వం.. ఆయాచోట్ల రాత్రి 9 గంటలకే దుకాణాలు మూసివేయాలని స్పష్టం చేసింది.అదే విధంగా.. రాష్ట్రంలో సినిమా థియేటర్లు తెరిచేందుకు అనుమతినిచ్చింది. అయితే, సీటుకు సీటుకు మధ్య గ్యాప్ ఉండాలని ఆంక్షలు విధించింది. ఇక కోవిడ్ ప్రొటోకాల్స్‌తో రెస్టారెంట్లు, జిమ్స్, కల్యాణ మండపాలకు అనుమతినిచ్చిన ప్రభుత్వం... శానిటైజర్, మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడం తప్పని సరి అని పునరుద్ఘాటించింది.



## ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అనిల్ కుంబ్లే

తాడేపల్లి: టీమిండియా మాజీ కోచ్, దిగ్గజ స్పిన్ బౌలర్ అనిల్ కుంబ్లే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన.. సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అనిల్ కుంబ్లే.. ఏపీ సీఎంతో భేటీ కావడం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనిల్ కుంబ్లే.. భారత జట్టు ప్రధాన కోచ్ సహా బీసీసీఐలో పలు ఉన్నత పదవులు చేపట్టాడు.



## జగన్‌రెడ్డి అసమర్థత వల్లే...: చంద్రబాబు

అమరావతి: జగన్‌రెడ్డి అసమర్థత వల్లే రాయలసీమ పొలాలకు పారాల్సిన కృష్ణా జలాలు నేడు సముద్రం పాలవుతున్నాయని మాజీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేస్తుంటే ఉత్తుత్తి లేఖలతో సీఎం కాలక్షేపం చేస్తున్నారని చెప్పారు. కేసుల మాఫీ కోసం ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లే సీఎం.. ఇప్పుడు ఎందుకు పీఎం, జలశక్తి మంత్రిని కలవట్లేదు? అని ప్రశ్నించారు. అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే కపటనాటకం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి శ్రీశైలంలో నీటి హక్కుల్ని కాపాడలేక చేతులెత్తేసి పుట్టిన గడ్డకు ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణా జల వివాదంపై వెంటనే సీఎం అఖిలపక్షాన్ని ప్రధాని, జలశక్తి మంత్రి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.



# సంపాదకీయం

మంగళవారం 06 జూలై 2021

## కమలంలో..అసమ్మతి, అసంతృప్తి, అభిజాత్యం, అహంకారం

అధికారం ఒక్కటే రాదు. దానితో పాటు కొన్ని అవలక్షణాలను కూడా తీసుకొస్తుంది. వాటిల్లో ముఖ్యమైనవి?అసమ్మతి, అసంతప్తి, అభిజాత్యం, అహంకారం. వీటి వల్లే ఎంతో కష్టపడి తెచ్చుకున్న అధికారం చివరికి పార్టీకి తలనొప్పులు, చికాకులు తెప్పిస్తుంది. అంతిమంగా అధికారం కనుమరుగవుతుంది. సుదీర్ఘకాలం అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగిన హస్తం పార్టీకి ఈ ఇబ్బందులు బాగా తెలుసు. వివిధ రాష్ట్రాల్లో ఏర్పడిన అంతర్గత కలహాలను చక్కబెట్టేందుకు గతంలో జి.కె.మూపనార్, గులాం నబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ వంటి ట్రబుల్ షూటర్లు ఉండేవారు. వీరికి ప్రజాబలం పెద్దగా లేనప్పటికీ తెరచాటు వ్యవహారాలను చక్కబెట్టగల నైపుణ్యం ఉండేది. అందుకే వారికి పార్టీలో ప్రాధాన్యం లభించేది.ఇప్పుడు కమలం పార్టీ ఇలాంటి గడ్డు పరిస్థితినే ఎదుర్కొంటోంది. ఇటు హస్తినలో, అటు వివిధ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. ప్రస్తుతానికి అయితే నరేంద్ర మోదీ నాయకత్వానికి ఎదురులేదు. కానీ అదే సమయంలో అధికారంలో ఉన్న కీలక రాష్ట్రాల్లో అసమ్మతి గళాలు బలంగానే వినపడుతున్నాయి. కొన్నిచోట్ల అధిష్టానమే అసమ్మతిని పరోక్షంగా ప్రోత్సహిస్తుందన్న ఆరోపణలు లేకపోలేదు. దేశానికి, పార్టీకి కీలకమైన గుండెకాయ వంటి యూపీలో పార్టీ పరిస్థితి సజావుగా లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిఉంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పనితీరుపై మోదీకి భిన్నాభిప్రాయం ఉంది. ఆయనను పదవి నుంచి తొలగించాలన్న యోచన సైతం మోదీకి ఉందని చెబుతున్నారు. మోదీ-యోగి ఎడమొహం పెడమొహం అన్నట్లుగా పరిస్థితి ఉంది.ఇటీవల జూన్ 5న యోగి పుట్టినరోజు సందర్భంగా యోగికి మోదీ కనీసం శుభాకాంక్షలు కూడా చెప్పలేదంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు.తాజాగా గతంలో గుజరాత్ లో తన వద్ద పని చేసిన ఐఏఎస్ అధికారిని యూపీ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడం యోగికి పుండు మీదకారం చల్లినట్లయింది. ఆయనను అప్పటికప్పుడు శాసనమండలికి నామినేట్ చేయించారు. ఇది యోగికి మింగుడుపడని పరిణామమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దక్షిణాదిన బీజేపీకి గుండెకాయ వంటి కర్ణాటకలోనూ కమలం కష్టాలు ఎదుర్కొంటోంది. ముఖ్యమంత్రి యడ్యూరప్పకు అధిష్టానం పొగ పెడుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్ నాయకత్వ మార్పు ఉండదని చెబుతున్నా, సీనియర్ మంత్రి కె.ఎస్.ఈశ్వరప్ప అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు. సీఎం వ్యతిరేక వర్గానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ మద్దతిస్తున్నారు. దాదాపు 17 శాతం గల లింగాయత్ వర్గానికి నాయకుడైన యడియ్యూరప్పను తొలగించడం అంత తేలికైన విషయం కాదు. అయినప్పటికీ హైమాండ్ ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతూనే ఉంది.అతిపెద్ద రాష్ట్రాల్లో ఒకటైన మధ్యప్రదేశ్ కు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివరాజ్ సింగ్ చౌహాన్ పరిస్థితి కూడా ఏమంత బాగా లేదు. హోంమంత్రి నరోత్తం మిశ్రా సీఎంకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. మరో మంత్రి వి.డి.శర్మ సైతం ఇదే బాటలో ఉన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు నరేందర్ సింగ్ తోమర్, థావర్ చంద్ గెహ్లాత్ కూడా సీఎంకువ్యతిరేకంగా దిల్లీలో చక్రం తిప్పుతున్నారు.పార్టీ జాతీయ కార్యదర్శి కైలాస్ విజయ వర్గీయ పేరును కొందరు కొత్త సీఎం పదవికి ప్రచారం చేస్తున్నారు. ఇక ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో దశాబ్దాల సీపీఎం పాలనకు చరమగీతం పాడి అధికారం అందుకున్న కమలం పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి బిప్లవ్ దేవ్ పై ఏకంగా ఆరుగురు శాసనభ్యులు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. మాజీ మంత్రి సుదీప్ రాయ్ బర్మన్ నాయకత్వంలో వీరు హస్తిన వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాను కలిశారు. సీఎం పనితీరుపై వ్యతిరేకతను వ్యక్తం చేశారు. దీంతో అక్కడ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ కు బీజేపీ నాయకత్వం అప్పగించింది. వచ్చే ఏడాది ఎన్నికలను ఎదుర్కోనున్న ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ లలోనూ బీజేపీ పరిస్థితి పైకి అనుకున్నంతగా గొప్పగా ఏమీ లేదు. అసమ్మతి గళాలు వినపడుతూనే ఉన్నాయి. ఇవి కమలనాథులకు కంటిమీద కునుకు లేకుండా చేయిస్తున్నాయి.

## ఐటి సిటీగా మారుతున్న విశాఖ



విశాఖపట్టణం, జూలై 5, (న్యూస్ పల్స్)విశాఖకు మరో పేరు ఉక్కు నగరం. ఆసియా ఖండంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ఉన్న విశాఖకు ఉక్కు లాంటి గర్వాన్ని బీజేపీ ప్రభుత్వం కరిగించేస్తోంది. విశాఖ ఉక్కుని ప్రైవేట్ పరం చేయాలని చూస్తోంది. ఆ ఆలోచన ఈ రోజుకు వాయిదా పడితే పడవచ్చు కానీ పూర్తిగా రద్దు చేసుకోవడం అనేది అసలు జరగదు అని ఢిల్లీ వర్గాల నుంచి వినవస్తున్న మాట. ఈ నేపథ్యంలో విశాఖ మీద జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. విశాఖకు ఆయన స్టీల్ సిటీ నుంచి ఐటీ సిటీగా కొత్త రూపు ఇవ్వదలచుకున్నారు.జగన్ మొదటి నుంచి విశాఖ విషయంలోనే ఆసక్తిగా ఉన్నారు. అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన నగరంగా వైజాగ్ ఉంది. కొంచెం ఖర్చు పెట్టినా కూడా డాబుసరి నగరంగా మారుతుంది అన్నది ఆయన ఆలోచన. అందుకే పరిపాలనా రాజధానిగా విశాఖను ఆయన ప్రకటించారు. అదే విధంగా ఇపుడు ఐటీ సిటీగా కూడా విశాఖను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఐటీ పరంగా విశాఖ నెమ్మదిగా ఎదుగుతోంది. గతంలో హైదరాబాద్ ఐటీకి కేంద్రంగా ఉంటే విశాఖ రెండవ స్థానంలో ఉంది. ఇపుడు విభజన ఏపీలో కచ్చితంగా విశాఖే నంబర్ వన్ కావాలి కూడా. అందుకే జగన్ విశాఖలో ఐటీ వర్సిటీనే స్థాపించనున్నారు.హైదరాబాద్ రాజధానిని ఉపాధి కేంద్రంగా అంతా భావిస్తారు. విభజన వద్దు అనుకున్నది కూడా అందుకోసమే. ఇపుడు విభజన ఏపీకి అలాంటి నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామన్నది జగన్ అజెండాగా ఉంది. విశాఖకు ఉన్న పొటెన్షియాలిటీని దృష్టిలో ఉంచుకుని అటు ఐటీ పరంగా ఇటు టూరిజం పరంగా అభివృద్ధి చేస్తే ఉపాధి కల్పన సాధ్యపడుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇచ్చి అయినా విశాఖలో ఏర్పాటు చేయించాలన్నది వైసీపీ సర్కార్ ఆలోచన. అలాగే యువత ఐటీలో నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. ఏపీలో ఐటీకి కేరాఫ్ గా విశాఖని చేస్తే ఉపాధి కల్పన సాధ్యపడుతుందన్నది జగన్ మాస్టర్ ప్లాన్. భారతదేశాన బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ లతో పోటీ పడే స్థాయి కూడా వస్తుందని భావిస్తున్నారు.విశాఖ ఐటీ రాజధాని కావడానికి స్థానికంగా ఉన్న పరిస్థితులు అనుకూలిస్తాయి. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు రేపటి రోజున రాజధాని కూడా విశాఖకు తరలివస్తే ఐటీకి మరింతగా ప్రోత్సాహం దక్కుతుంది. ప్రభుత్వం ప్రకటించిన ఐటీ పాలసీ కూడా కంపెనీల స్థాపనకు మేలు చేసేదిగా ఉంది. ఇక ప్రభుత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల విశాఖలో ఐటీ రంగం పరుగులు పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాలి. అలాగే విద్యారంగానికి నిలయంగా విశాఖను తీర్చిదిద్దుతామని మంత్రి అవంతి శ్రీనివాసరావు అంటున్నారు. మొత్తానికి ప్రభుత్వ పెద్దల ఆలోచనలు చూస్తుంటే వైజాగ్ కి ఐటీ సిటీ కళ వచ్చేసినట్లే అనుకోవాలేమో

## భీమిలీలో టీడీపీకి కలిసొచ్చే కాలమే

విశాఖపట్టణం, జూలై 5, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలో భీమిలీ నియోజకవర్గం అత్యంత ప్రతిష్టాత్మకమైనది. తెలుగుదేశానికి కంచుకోట. ఈ నియోజకవర్గంలో చివరి నిముషంలో టికెట్ తెచ్చుకున్నా కూడా అవతల పార్టీ అభ్యర్ధికి మూడు చెరువుల నీళ్ళు తాగించే సామర్ధ్యం టీడీపీ అభ్యర్ధికి ఉంటుంది. దానికి అచ్చమైన ఉదాహరణ మాజీ ఎంపీ సబ్బం హరి. 2019 ఎన్నికల్లో ఆయన లాస్ట్ మినిట్ లో భీమిలీ నుంచి పోటీ చేసినా కేవలం తొమ్మిది వేల ఓట్ల తేడాతోనే ఓటమి పాలు అయ్యారు. అది కూడా వైసీపీకి ఎంతో ఊపు ఉన్న పరిస్థితుల్లో అవంతి శ్రీనివాస్ కి సొంత బలం ఉన్నచోట అన్ని ఓట్లు వచ్చాయి. అలాంటి భీమిలీలో హరి మరణం తరువాత ఇంచార్జి లేకుండా పోయారు. ఇపుడు మాజీ ఎంపీపీని తెచ్చి ఇంచార్జిని చేశారు.భీమిలీలో బలమైన సామాజిక వర్గంగా కాపులు ఉన్నారు. ఇప్పటికి నాలుగు సార్లుగా ఆ సామాజిక వర్గం నుంచే వరసగా ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. దాంతో టీడీపీ కూడా మరోసారి ఆ వర్గానికే పెద్ద పీట వేసింది. సబ్బం హరి వెలమ సామాజికవర్గానికి చెందిన నేత. ఇపుడు అవంతి శ్రీనివాసరావుకు ధీటు అయిన కాపు నేతను టీడీపీ ఎంపిక చేసింది. గతంలో టీడీపీలో ఉంటూ ఎంపీపీగా గెలిచిన కోరాడ రాజబాబు ప్రజారాజ్యం నుంచి 2009 ఎన్నికల్లో భీమిలీ ఎమ్మెల్యే అభ్యర్ధిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత వైసీపీలో చేరిన ఆయన టికెట్ దక్కకపోవడంతో టీడీపీలోకి తిరిగి వెళ్లిపోయారు. ఇన్నాళ్ళకు ఆయనకు అవకాశం వచ్చిందని క్యాడర్ ఆనందిస్తున్నారు.అయితే భీమిలీ సీటు మీద చాలా మంది కన్ను ఉంది. రాజబాబుని ఈ రోజుకు ఇంచార్జిగా నియమించినా భవిష్యత్తుల్లో మార్పుచేర్పులు ఉంటాయని కూడా అంచనా వేస్తున్నారు. మత్స్య కారుల కోటాలో తనకు సీటు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా నూకరాజు కోరుకుంటున్నారు. అదే విధంగా టీడీపీ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ కూడా భీమిలీ నుంచి పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు 2024 నాటికి టీడీపీలో చురుకుగా ఉంటే ఆయనకే టికెట్ అన్న మాట కూడా ఉంది. వీరందరి కంటే కూడా బాలయ్య చిన్నల్లుడు భరత్ కూడా ఇదే సీటు మీద కన్నేశారని టాక్ నడుస్తోంది.భీమిలీలో వైసీపీ మరోసారి గెలవాలి అంటే కష్టపడాల్సి ఉంటుందని అంటున్నారు. ఇటీవల జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్ధులు పెద్ద సంఖ్యలో గెలిచారు. అలాగే కార్పోరేషన్ ఎన్నికల్లో కూడా ఎనిమిది డివిజన్లకు గానూ అయిదు టీడీపీ పరం అయ్యాయి. నాయకులతో పని లేకుండా బలమైన క్యాడర్ ఇక్కడ టీడీపీకి ఉంది. దాంతో ఎన్నికల నాటికి అనుకూలంగా గాలి వీస్తే భీమిలీలో మరోమారు సైకిల్ జోరుగా సాగడం ఖాయమని అంటున్నారు. ఏది ఏమైనా అవంతి ఇప్పటినుంచే తన నియోజకవర్గం మీద ఒక కన్ను వేసి ఉండకపోతే మాత్రం చేజేతులా సీటు కోల్పోవలసి ఉంటుందని కూడా అంటున్నారు.

## రెండేళ్లలో 75 శాతం ప్రజలు ఖుషీ

### సర్వేలతో కూల్ గా ఫ్యాన్

విజయవాడ, జూలై 5, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ఆశించినట్లే జరుగుతోంది. మే చివరి నాటికి రెండేళ్ల పరిపాలన పూర్తయింది. దీనిపై జూన్ రెండో వారంలో అభిప్రాయ సేకరణ పేరిట అంతర్గతంగా చేయించుకున్న సర్వే ఒకటి నిర్వహించారు. ఆ ఫలితాలు పార్టీ నాయకత్వంలో జోష్ నింపుతున్నాయి. దాదాపు ప్రతిపక్షాలన్నీ ఏకమై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపైనా, వైసీపీ ప్రభుత్వంపైనా పోరాటం సాగిస్తున్నాయి. ప్రతి అంశంలోనూ ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ రచ్చ చేస్తున్నాయి. మీడియా సంగతి చెప్పనే అక్కర్లేదు. రంధ్రాన్వేషణ చేస్తూ తప్పులను భూతద్దంలో వెతికి మరీ ప్రసారం చేస్తున్నాయి తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియా సంస్థలు. నిజానికి ప్రతిపక్షాల సమరం కంటే ఈ సంస్థల పోరాటమే ఎక్కువై పోయింది. ఈ నేపథ్యంలో వైసీపీ సర్వే ఆ పార్టీ క్యాడర్ కు చల్లని కబురు చెప్పింది. ప్రతిపక్షాల ప్రచారం ప్రభావం ప్రజలపై ఏమాత్రం పడటం లేదనేది సర్వే సారాంశం. పైపెచ్చు ప్రజలు గత ప్రభుత్వం కంటే సంతృప్తిగానే ఉన్నారనేది సర్వే తేల్చిన అంశంగా చెబుతున్నారు. అయితే దీనిని ప్రశాంత్ కిశోర్ టీమ్ నిర్వహించిందా? లేక వైసీపీ స్వయంగా తన మీడియా ద్వారా నిర్వహించిందా? అన్న వివరాలు తెలియరావడం లేదు.రెండేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలు అనేకం వివాదాస్పదంగానే మిగిలాయి. పర్యవసానాలు ఆలోచించకుండా , ముందు వెనకలు చూడకుండా ముఖ్యమంత్రి ఆలోచనలు అమలులో పెట్టడానికి ప్రయత్నించి ప్రభుత్వం అనేకసార్లు భంగపాటుకు గురైంది. సంక్షేమ పథకాలు మినహాయిస్తే, తీసుకున్న నిర్ణయాలు చాలా వరకూ అమలు కూడా కాలేదు. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లిషు మీడియం, మూడు రాజధానులు, శాసనమండలి రద్దు వంటి విధానపరమైన అంశాల్లో ఇప్పటికే తలబొప్పి కట్టింది. న్యాయస్థానాలు అడుగడుగునా అడ్డు తగులుతున్నాయి. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆక్షేపిస్తున్నాయి. వీటికి పెద్ద ఎత్తున మీడియాలో ప్రచారం లభిస్తోంది. అయితే ప్రజలు వీటిని పట్టించుకోవడం లేదని జగన్ మోహన్ రెడ్డి పరిపాలన బాగుందంటూ కితాబునిస్తున్నారంటూ వైసీపీ సర్వే చెబుతోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు గాను నలభై అయిదు నియోజకవర్గాల్లో సర్వే సాగింది. ఇందులో ముప్పైఅయిదు గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలు, పది పట్టణ ప్రాంత నియోజకవర్గాలు ఉన్నట్లు తెలిసింది.సర్వేలో తమ అభిప్రాయాలు వెల్లడించిన వారిలో 75శాతం మంది ప్రజలు పాలనపై సంతృప్తిని వ్యక్తం చేశారనేది వైసీపీ వర్గాల మాట.రెండేళ్ల పాలన తర్వాత ప్రజల్లో 75 శాతం మంది ప్రభుత్వంపై విశ్వాసం ప్రకటించడమంటే చిన్న విషయం కాదు.అదే నిజమైతే ప్రధాన ప్రత్యర్థి అయిన తెలుగుదేశం ఆత్మావలోకనం చేసుకోవాల్సి ఉంటుంది. పరిపాలన మొదలైన తొలి నాటి నుంచే వైసీపీని టీడీపీ టార్గెట్ చేస్తూ వస్తోంది. అవినీతి, అప్పుల సంక్షోభం రెండూ అస్త్రాలుగా చేసుకుంటూ ఎడతెగని సమరం సాగిస్తోంది. దీని ప్రభావం ప్రజలపై పడలేదంటే టీడీపీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. తెలుగుదేశాన్ని మీడియాను కలగాపులగం చేసి వైసీపీ చేస్తున్న ప్రచారం వల్ల ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజలు విశ్వసించడం లేదనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతి చిన్న విషయానికి తెలుగుదేశం చేసే ఓవరాక్షన్ జగన్ కు అడ్వాంటేజ్ అవుతోంది. పరిపాలనలో కుదురుకోకుండానే నిరంతరం ఫిర్యాదులు, న్యాయపోరాటాలతో ప్రభుత్వాన్ని చికాకు పరచాలని తెలుగుదేశం ప్రయత్నించింది. 51 శాతం పైగా ప్రజల మద్దతు తో గెలిచిన జగన్ కు ఈ విపక్ష అత్యుత్సాహం కలిసి వచ్చింది. ప్రతిపక్షాల పోరాటంలోని హేతుబద్ధతపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఒకవేళ వైసీపీ చెబుతున్న సర్వే విషయాలే నూటికి నూరుపాళ్లు పక్కాగా తేలితే మాత్రం ఇప్పట్లో విపక్షాల ఆశలు ఏపీలో నెరవేరవనే చెప్పవచ్చు. సర్వేలో ప్రజలు వైసీపీకి కూడా షాకిచ్చే కొన్ని నిజాలు చెప్పినట్లు తెలుస్తోంది. రాష్ట్రం అధికంగా అప్పులు చేస్తున్న విషయం ప్రజలకు తెలుసు. అంతేకాకుండా అభివృద్ధి నిధులు తగినంత కేటాయించడం లేదనే విషయంపైనా మధ్యతరగతి కి మాత్రమే కాదు, పేద వర్గాలకూ అవగాహన ఏర్పడింది. అయితే గతంలో తెలుగుదేశం హయాంలోనూ అప్పులు చేశారు. అవి నాయకుల మామూళ్లుగా మారిపోయాయి. ఇప్పుడు చేస్తున్న అప్పులు సంక్షేమ పథకాల రూపంలో తమకు వస్తున్నాయనేది ప్రజలు అనుకుంటున్నారనేది సర్వే సారాంశం. ప్రజల అభిప్రాయాలను రికార్డు చేసుకుని వైసీపీ అధిష్టానానికి ఈ నివేదిక అందించారు. ఆస్తుల విలువలు పడిపోవడం, ఉద్యోగ కల్పనలో లోపాలు వంటివి ప్రజల్లో 25 శాతం మంది అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. అయితే సర్వేను ఏ విధానంలో నిర్వహించారు? శాంపిల్ పరిమాణమెంత? నిర్వహించిన వారు నిపుణులైన సెఫాలజిస్టులా? లేక గ్రామ వాలంటీర్ల ఆధ్వర్యంలో నమూనాలు సేకరించారా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. వాటి మీదనే సర్వే సాధికారత ఆధారపడుతుంది.

## ఛీర్ ఫర్ ఇండియా సెల్ఫీ పాయింట్ ను అవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు రానున్న టోక్యో ఒలింపిక్స్ లో రాష్ట్రం తరపున ఆడుతున్న క్రీడాకారుల ప్రతిభ లు అత్యున్నతంగా ఉండడం ద్వారా రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేసేలా చీర్ అప్ కార్యక్రమం ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు కలెక్టర్ ఛాంబర్ లో చీర్ ఫర్ ఇండియా క్యాంపైన్ లో భాగంగా సెల్ఫీ పాయింట్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రం తరపున షటిల్ బాడ్మింటన్ ఆడుతున్న పి .వి.సింధు, షటిల్ బాడ్మింటన్ ఆడుతున్న సాత్విక్ సాయి రాజ్, చిత్తూరు జిల్లా నుంచి హాకీ క్రీడాకారిణి ఈ.రజని లకు మంచి జరగాలని ఒలింపిక్స్ లో పథకాలతో రావాలని కోరుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అన్నారు. 32వ ఒలింపిక్ క్రీడలు జపాన్లోని టోక్యోలో జూలై 23 నుంచి ఆగస్టు 8 వరకు జరగ నున్నాయి. ఈ క్రీడలలో చీర్ ఫర్ ఇండియా క్యాంపైన్ లో భాగంగా సెల్ఫీ పాయింట్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

## నరేంద్ర కు పెరిగిన గ్రాఫ్

గుంటూరు, జూలై 5, (న్యూస్ పల్స్)టీడీపీలో నేతలకు గత 2019 ఎన్నికల నుంచి కూడా కష్టాలు కొనసాగుతున్నాయి. అనేక మంది కీలక నేతలు.. పలు కేసుల్లో ఇరుక్కుని జైలు పాలు కూడా అయ్యారు. టీడీపీ రాష్ట్ర చీఫ్ అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర.. ఇలా అనేక మంది కేసుల్లో ఇరుక్కుని.. బెయిల్‌పై బయటకు వచ్చినవారే. ఇదే విధంగా గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ దిగ్గజం, ఐదు సార్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కూడా ఇటీవల సంగం డెయిరీలో అవకతవకలకు పాల్పడ్డారంటూ.. సీఐడీ పోలీసులు.. ఆయనను అరెస్టు చేయడం తెలిసిందే.తర్వాత కొన్నాళ్లు ధూళిపాళ్ల నరేంద్ర జైల్లో ఉండడం.. ఆ తర్వాత ఇటీవల బెయిల్ రావడం తెలిసిందే. అయితే.. టీడీపీలో ఇప్పటి వరకు అరెస్టయి.. బెయిల్‌పై వచ్చిన నేతలకు, ధూళిపాళ్ల నరేంద్రకు చాలా తేడా ఉంది. కొల్లు రవీంద్ర ఓ హత్య కేసులోను, అచ్చెన్నాయుడును ఈఎస్ ఐ మందుల కుంభకోణానికి సంబంధించిన అవినీతిలోను అరెస్టు చేశారు. కానీ, సంగం డెయిరీ చైర్మన్‌గా ఉన్న ధూళిపాళ్ల వ్యవహారానికి వచ్చేసరికి.. వేలాది మంది రైతులకు, లక్షల కుటుంబాలకు సంబంధించిన విషయం. సంగం డెయిరీ ద్వారా ఆయన అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వం తెలిపింది.అయితే.. నిజంగానే ధూళిపాళ్ల నరేంద్ర అక్రమాలకు పాల్పడి ఉంటే.. రైతులు, వారి కుటుంబాలపై ప్రభావం పడి ఉండాలి. దీంతో ధూళిపాళ్ల ప్రాతినిధ్యం వహించిన పొన్నూరు నియోజకవర్గంపై అరెస్టు ప్రభావం ఖచ్చితంగా ఉండాలి. ప్రజలను ధూళిపాళ్ల నరేంద్రపై ఆగ్రహంతో ఉండాలి. కానీ, చిత్రంగా ధూళిపాళ్ల నరేంద్రపై సానుభూతి పెరగడం గమనార్హం. ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన ధూళిపాళ్లపై ఇప్పటి వరకు ఈ పాతికేళ్లలో ఒక్క మరక కూడా లేకపోవడం.. వివాదాలకు దూరంగా ఉండడం వంటివి ఆయనకు మంచి మార్కులు వేయిస్తున్నాయి.అంతేకాదు.. జగన్ సర్కారు దూకుడు సరికాదని.. ధూళిపాళ్ల నరేంద్ర వంటి నేతపై రాజకీయంగా ప్రజా క్షేత్రంలో ఏదైనా ఉంటే చూసుకోవాలి.. తప్ప ఇలా వ్యక్తిగత కక్షలకు దారితీసేలా వ్యవహరించడం సరికాదని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందే ధూళిపాళ్లకు వైసీపీలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని గట్టిగా ఆఫర్లు వచ్చాయి. అయితే ఆయన పార్టీ మారలేదు. ఇక ఇప్పుడు ఆయన్ను ప్రభుత్వం సంగం డెయిరీ కేసుల్లో అరెస్టు చేసినా కావాలనే టార్గెట్ చేసిందన్న సంకేతాలే ప్రజల్లోకి ఎక్కువగా వెళ్లాయి. మొత్తంగా చూసుకుంటే.. తాజా సంగం వివాదం అనంతరం..ధూళిపాళ్ల నరేంద్రకు సానుభూతి పెరిగిందనడంలో సందేహం లేదు.

## నోరుమెదపనికేవీపీ, ఉండవల్లి




విజయవాడ, జూలై 5, (న్యూస్ పల్స్)వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మగా చెప్పుకునే ఆయన ఒకరు. వైఎస్ వల్లనే తాను రాజకీయంగా ఇంతటి వాడయ్యానని చెప్పుకుంటే తిరిగే ఆయన మరొకరు.కానీ వైఎస్ వల్ల అంత లబ్దిపొందిన వీరిద్దరూ ఈ సమయంలో మాత్రం నోరు మెదకపకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డిది ఒక అధ్యాయం. ఆయన అలా వచ్చి ఇలా వెళ్లిపోయరు. దశాబ్దాలుగా రాజకీయాలు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ ఒక వెలుగు వెలిగారువైఎస్ అంటే తొలుత గుర్తుకు వచ్చేది కేవీపీ రామచంద్రరావు. వైఎస్ ఆత్మగా ఈయనకు పేరు. అధికారంలో ఉన్నప్పుడు షాడో సీఎంగా కూడా వ్యవహరించేవారు. వైఎస్ పుణ్యమా అని రాజ్యసభ పదవి దక్కింది. వైఎస్ మరణానంతరం కేవీపీ రామచంద్రరావు కాంగ్రెస్ లోనే ఉండిపోయారు. ఆయన ప్రస్తుతం రాజకీయంగా క్రియాశీలకంగా లేకపోయినా వైఎస్సార్ మీద ఆరోపణలు వచ్చినప్పుడు ఈయన మౌనం వహించడం చర్చనీయాంశమైంది.ఇక మరో నేత ఉండవల్లి అరుణ్ కుమార్. వైఎస్సార్ పుణ్యమా అని తాను రాజకీయాల్లో ఎదిగానని చెప్పుకుంటారు. వైఎస్సార్ చలవ వల్లే ఉండవల్లి అరుణ్ కుమార్ రెండుసార్లు పార్లమెంటు సభ్యుడు అయ్యారు. వైఎస్సార్ అంటే పిచ్చి అభిమానం చూపుతారు. కాంగ్రెస్ లో లేకపోయినా ఈయన కూడా క్రియాశీలక రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. వైఎస్ అంటే పడి చచ్చపోయే ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా నోరు మెదపడం లేదు.వైఎస్ ను విమర్శిస్తున్నా?.గత కొంత కాలంగా వైఎస్సార్ పై తెలంగాణ నేతలు మాటల తూటాలు పేలుస్తున్నా వీరిద్దరూ మాట్లాడకపోవడంపై రాజకీయంగా చర్చ జరుగుతుంది. నీటి జగడం అయినప్పటికీ వైఎస్సార్ కు మద్దతుగా నిలిచి తెలంగాణ నేతలకు కౌంటర్ ఇవ్వాల్సిన సమయంలో వీరి మూగనోము హాట్ టాపిక్ అయింది. వైఎస్ మీద పుస్తకాలు రాసి, ఆయన వర్ధంతి, జయంతుల రోజు నివాళులర్పిస్తే సరిపోదని, ఆయనపై విమర్శలు వచ్చినప్పుడు ఖండిస్తేనే అది సరైన నివాళి అవుతుందని వీరిద్దరిని ఉద్దేశించిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విన్పిస్తున్నాయి.

## అప్రూవర్ గా చెరుకూరి... నారాయణకు సినిమానే

గుంటూరు, జూలై 5, (న్యూస్ పల్స్)రాజధాని భూముల వ్యవహారం తెలుగుదేశం పార్టీ నేతల మెడకు చుట్టకునేలా ఉంది. ముఖ్యంగా అప్పటి మున్సిపల్ మంత్రి నారాయణకు ఇబ్బందులు తప్పేలా లేవు. నారాయణను త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. నారాయణను విచారించాలని ఇప్పటికే హైకోర్టులో సీఐడీ అధికారులు పిటీషన్ దాఖలు చేశారు. అమరావతి భూముల విషయంలో నారాయణ కీలక పాత్ర పోషించారని సీఐడీ దర్యాప్తులో వెల్లడయింది.సీఆర్డీఏ చెరుకూరి శ్రీధర్ రాజధాని వ్యవహారంలో కీలకంగా మారారు. చెరుకూరి శ్రీధర్ గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గా అప్పడు ఉన్నారు. ఆయనను చంద్రబాబు ప్రభుత్వం సీఆర్డీఏ కమిషనర్ ఛైర్మన్ గా నియమించారు. ఆయన నేతృత్వంలోనే రాజధాని భూముల సేకరణ జరిగింది. అప్పటి మంత్రులు నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావులు దగ్గరుండి ల్యాండ్ పూలింగ్ వ్యవహారాలను పరిశీలించారు.ఇప్పుడు తాజాగా చెరుకూరి శ్రీధర్ ను సీఐడీ అధికారులు విచారించారు. ఆయనను ఈ కేసులో సాక్షిగా సీఐడీ పేర్కొంది. ఆయన స్టేట్ మెంట్ ను రికార్డు చేశారు. తుళ్లూరు మండలంలో రెవెన్యూ రికార్డులను మాయం చేశారు. ఈ మాయం వెనక కూడా నారాయణ హస్తం ఉందని భావిస్తున్నారు. తనకు తెలియంకుడానే రహస్యంగా వారు రికార్డులు తెప్పించుకున్నారని చెరుకూరి శ్రీధర్ విచారణలో వెల్లడించారు.2014లోనే రికార్డులు మాయం అయ్యాయని, ల్యాండ్ పూలింగ్ మాత్రం 2015లో ప్రారంభమయిందని చెరుకూరి శ్రీధర్ చెప్పారు. అంతే కాకుండా ఎస్సీఎస్టీ యాక్టుకు విరుద్ధంగా అసైన్డ్ మెంట్ ల్యాండ్ విషయంలో జీవో 41ని తెచ్చారన్నారు. ఇది చట్టవిరుద్ధమేనని చెప్పారు.

# వైసీపీ, రఘురామ మధ్యలో బీజేపీ

ఏలూరు, జూలై 5 (న్యూస్ పల్స్)రఘురామ కృష్ణరాజు విషయంలో వైసీపీ సీరియస్ గా ఉంది. ఇటీవల స్పీకర్ కు మరోసారి ఆయన పై అనర్హత వేటు వేయాలని లేఖ రాసింది. దీనిపై కూడా స్పందన రాకపోతే కేంద్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమవ్వాలని వైసీపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీని, పార్టీ అధినేతకు వ్యతిరేకంగా ఎన్ని కామెంట్స్ చేస్తున్నా రఘురామ కృష్ణరాజుపై చర్యలు తీసుకోకపోవడంపై జగన్ సయితం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.జగన్ తన ఢిల్లీ పర్యటనలోనూ రఘురామ కృష్ణరాజు విషయాన్ని చర్చించారు. తమ పార్టీకి చెందిన ఎంపీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ గత ఏడాది జులై 3న లోక్ సభ స్పీకర్ ను వైసీపీ నేతలు కోరారు. అయితే ఇంత వరకూ దానిపై చర్యలు తీసుకోలేదు. అంతటితో ఆగకుండా పదకొండు నెలల తర్వాత పిటిషన్‌ను సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908 ప్రకారం సవరించాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసు రావడాన్ని వారు అభ్యంతరం చెబుతున్నారు.జాప్యం చేయాలనే ఇలా చేస్తున్నారన్న అసహనం వైసీపీలో వ్యక్తమవుతోంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రఘురామ కృష్ణరాజుపై చర్యలు తీసుకోవాల్సిందేనంటున్నారు వైసీపీ నేతలు. ఈ జాప్యం కె. మేఘచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్ కేసులో సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పునకు విరుద్ధమవుతుందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అనర్హత పిటిషన్ లను మూడు నెలల సమయంలోగా పరిష్కరించాల్సి ఉన్నా ఏడాది గడుస్తున్నా అతీగతీ లేదంటున్నారు.మరోవైపు రఘురామ కృష్ణరాజు పార్టీని, ప్రభుత్వాన్ని రోజు ఇరుకునపెడుతుండటంతో ఇక తాడో పేడో తేల్చుకోవాలని సిద్ధమయ్యారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పెద్దలపై వత్తిడి తేవాలని భావిస్తున్నారు. తమకు కావాల్సినప్పుడు ఉపయోగించుకునే కేంద్రం పెద్దలు, తమకు అవసరమైనప్పుడు ఉపయోగపడటం లేదన్న ఆగ్రహంతో ఉన్నారు. మొత్తం మీద రఘురామ కృష్ణరాజు వ్యవహారం బీజేపీకి, వైసీపీకి మధ్య స్నేహం చెడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# ఏనుగుల ధ్వంస రచన

చిత్తూరు జూలై 5 (న్యూస్ పల్స్)గజరాజులు మకాం మార్చాయి వి.కోట పరిసరాల్లోకి ప్రవేశించాయి. అర్ధరాత్రి అరటి..టమోటా తోటలను ధ్వంసం చేశాయి అపార నష్టాన్ని మిగిల్చాయి. అటవీ శాఖ తీరుపై అన్నదాతలు ఆగ్రహిస్తున్నారు. చిత్తూరు జిల్లా వి.కోట మండలం నాగిరెడ్డిపల్లి,కుమ్మరమడుగు గ్రామల్లో నిన్న అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాలపై స్వైరవిహారం చేశాయి..రైతుల కథనం మేరకు నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ 1400 వందల అరటి మొక్కలు పెంపకానికి 3 లక్షలు ఖర్చు పెడితే రాత్రికి రాత్రే ఏనుగులు ధ్వంసం చేసి నేలమట్టం చేశాయని ఆవేదన చెందారు.అప్పులు చేసి పంట చేస్తే ఏనుగులు నాశనం చెయ్యడంతో కన్నీటి పర్యంతమయ్యారు..పంట నాటిన మూడు నెలలకు ముందు ఇదే రకంగా ఏనుగులు ధ్వంసం చేసి సర్వ నాశనం చేశాయన్నారు.2 లక్షలు నష్టపోయామన్నారు.అటవీశాఖ 10 వేలు పరిహారంతో చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పంట మొదట్నుంచీ మొక్కలు నాటి,మిగిలిన మొక్కల్ని రక్షించుకుంటూ వచ్చామన్నారు.ప్రస్తుతం అరటి తోట గెలలు తోశాయి.నెల రోజుల్లో కోత కోయాల్సి ఉంది.ఈ తరుణంలో రాత్రి 14 ఏనుగుల గుంపు మూకుమ్మడిగా తోటలోకి ప్రవేశించి పంటను తొక్కి తిని నాశనం చేశాయి.సుమారు 3 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు తెలిపారు.అనంతరం కుమ్మరమడుగు గ్రామానికి చెందిన రైతు సోమప్ప టమోటా,బీన్స్ తోటలపై విరుచుకుపడ్డాయి.కోత దశలో ఉన్న టమోటా తోట,బీన్స్ నేలమట్టం చేశాయి.నీటి సరఫరా పైపులు,గేట్వాల్వులు,సైతం ధ్వంసం చేశాయి.కాపల గుడిసెను కూల్చాయి.ఎప్పుడూ గుడిసెలు ఉంటూ పంటను వన్య మృగాల నుంచి రక్షించుకునే వాళ్లు.అయితే నిన్న పంట కాపలాకు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.లేకపోతే ప్రాణాపాయం జరిగేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.2 లక్షల నష్టం వాటిల్లినట్టు ఆయన తెలిపారు. అరకొర పరిహారం తో చేతులు దులుపుకోవడం రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

# సమరస్యమే పరిష్కారం

విజయనగరం మాన్సస్ ట్రస్ట్ వ్యవహారం ఇంకా కోర్టు పరిధిలో ఉందని, అప్పుడే దానిపై మాట్లాడటం సముచితం కాదని మున్సిపల్ శాఖా మంత్రి బొత్సా సత్యనారాయణ అన్నారు.ట్రస్ట్ కార్యకలాపాలకు సంబంధించి ఆడిట్ జరిపించాల్సిన బాధ్యత ట్రస్ట్ పాలకులదేనని,16 ఏళ్లుగా ఆడిట్ ఎందుకు చేయలేదో అశోక్ గజపతిరాజుకే తెలియాలని బదులిచ్చారు.అంతకు ముందు ఒక కోటీ 48 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో గల మేయర్,డిప్యూటీ మేయర్ పరిపాలన విభాగంకు సంబంధించిన కార్యాలయాలను బొత్సా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అమరావతి భూముల వ్యవహారంలో అక్రమాలు జరగాయన్నది స్పష్టమని, దానిపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మరోవైపు క్రిష్ణా నదీ జలాల వాటా విషయంలో ఏపీ ప్రభుత్వం న్యాయబద్ధంగానే వెళుతోందని,కాని తెలంగాణ ప్రభుత్వ పెద్దల ఆలోచనలో మార్పు రావడం దురదృష్టకరమని రాష్ట్ర మంత్రి బొత్స వ్యాఖ్యానించారు. విద్యుత్ ను ఎక్కడ నుంచైనా కొనుక్కోవచ్చుగాని, జలాలను కొనుక్కోలేమన్న విషయాన్ని తెలంగాణ పెద్దలు గుర్తించాలన్నారు. హక్కులతో పాటు మానవతా విలువలను కూడా వారు గుర్తించాలని కోరారు. తమ మంత్రులెప్పుడూ పరుష పదజాలాన్ని వాడకుండా, తమ హక్కుల కోసం అడుగుతున్నామని తెలిపారు. సామరస్యంగా సమస్య పరిష్కరించే విధంగా ఇరు రాష్ట్రాలు వ్యవహరించాలనే ఉద్దేశ్యంతోనే తాము వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు చట్టాలు, ట్రిబ్యునల్ ఉన్నాయని, తెలంగాణ ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.

## అమెరికా ఇండిపెండెన్స్ డేను ఫేస్‌బుక్ సీఈవో ఎలా జరుపుకున్నారో చూశారా.. వీడియో

వాషింగ్టన్: అమెరికా ఆదివారం (జులై 4) తన 245వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న విషయం తెలుసు కదా. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్ వేక్‌బోర్డింగ్ చేస్తూ ఈ ఇండిపెండెన్స్ డేను వినూత్నంగా జరుపుకున్నాడు. చేతుల్లో అమెరికా జెండాను పట్టుకొని ఆయన వేక్‌బోర్డింగ్ చేస్తున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. బ్యాక్‌గ్రౌండ్‌లో జాన్ డెన్వర్ ఫేమస్ సాంగ్ టేక్ మీ హోమ్, కంట్రీ రోడ్స్ ప్లే అవుతుండగా.. జుకెర్‌బర్గ్ వేక్‌బోర్డ్‌పై బ్యాలెన్స్ చేసుకుంటూ నీళ్లల్లో దూసుకెళ్లారు. మార్క్ 1984లో న్యూయార్క్‌లో జన్మించినా.. ఆయన పూర్వీకులు మాత్రం జర్మనీ, ఆస్ట్రియా, పోలాండ్‌లకు చెందిన వాళ్లు కావడం గమనార్హం.

# సముద్రంలో వృథాగా నీరు

విజయవాడ జూలై 5, (న్యూస్ పల్స్)తెలంగాణ ప్రభుత్వం వద్దని చెప్పినా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. అది వేరే పంచాయతీ. కానీ అలా దిగువకు వస్తున్న నీళ్లన్నింటినీ ఏపీ సర్కార్.. ప్రకాశం బ్యారేజీ గుండా సముద్రంలోకి పంపేస్తోంది. ఇక్కడే చాలా మందికి ఓ సందేహం వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేయడం ఆపలేనప్పుడు.. అలా వచ్చిన నీటినైనా రైతులకు పంపిణీ చేయకుండా ముద్రం పాలు ఎందుకు చేస్తున్నారన్నదే ఆ సందేహం. ప్రస్తుతం కృష్ణా డెల్టాలో నారు మళ్ల సీజన్. తూర్పు, పశ్చిమ కాలువ కింద ఉన్న రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. వారికి నీరు విడుదల చేస్తే నారుమళ్లు రెడీ చేసుకుంటారు. కానీ ప్రభుత్వం అసలాంటి ఆలోచన చేయకుండా నేరుగా సముద్రంలోకి వదిలేస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి రోజుకు తొమ్మిది వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోంది. ప్రభుత్వం తీరుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా అయితే ఈ పాటికి పట్టిసీమ ద్వారా నీరువచ్చి ఉండేది. ఆ నీటితో నారుమళ్లు పోసుకునేవారు. ఈసారి పట్టిసీమ నీరు రాలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేస్తూండటంతో దిగువకు నీరు వస్తోంది. వాటినైనా ఇస్తే రైతులు వరి నాట్లు వేసుకుంటారు. కానీ ప్రభుత్వం అలాంటి ఆలోచన చేయడం లేదు. దీనికి కారణం.. రేపు కృష్ణా ట్రిబ్యూనల్‌లో?తాము విద్యుత్ ఉత్పత్తి చేసినా నీరు ఏపీకే వెళ్లిందని..వారు కాల్వలకు మళ్లించుకున్నారని తెలంగాణ సర్కార్ వాదిస్తుందనే అంచనాతో? తెలంగాణ సర్కార్ నీటిని వృధా చేసిందని చెప్పడానికే.. సముద్రంలోకి పంపుతున్నారన్న భావన వ్యక్తమవుతోంది. అయితే సముద్రంలోకి పోయే నీరు రైతులకు ఉపయోగపడినంత మాత్రాన.. తెలంగాణ వాడినట్లు ఎందుకు అవదని.. ప్రభుత్వం గట్టిగా వాదనలు వినిపించే ప్రయత్నం చేయాలి కానీ.. నీటిని సముద్రంలోకి వదిలేయడం ఏమిటని రైతులు అంటున్నారు. రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతూండటంతో ప్రభుత్వం కూడా.. సముద్రంలోకి పంపే బదులు కాల్వల్లోకి మళ్లించాలన్న ఆలోచన చేస్తున్నట్లుగా ఉంది. ఎంత త్వరగా నిర్ణయం తీసుకుంటే.. రైతులకు అంత మేలు.. లేకపోతే.. ఇబ్బందే.

న్యాయ పోరాటానికి రైతులు

రెచ్చగొడితే రెచ్చిపోబోమని.. ఎక్కడ మాట్లాడాలో అక్కడే మాట్లాడతామని .. కృష్ణాజలాలు సముద్రం పాలవుతున్నా.. నింపాదిగా ఏపీ ప్రభుత్వాన్ని చిటికెన వేలితో నడిపిస్తున్నానని భావించే సలహాదారు సజ్జల చెబుతున్నారు. కానీ ఆయనకు ఉన్నంత ధీమా కృష్ణా డెల్టా రైతులకు లేకుండా పోయింది. నీళ్లన్నీ సముద్రంలోకి పోతే.. తర్వాత కాలేది తమ కడుపేనని అర్థం చేసుకుని న్యాయపోరాటం ప్రారంభించారు. ప్రధానికి లేఖలు రాశామని.. కేంద్రం మధ్యవర్తిత్వం చేస్తోందని.. సజ్జల చెబుతున్నారు. కానీ రైతులు మాత్రం ఇలాంటి మాటలు నమ్మడం కన్నా.. తమ పోరాటం తాము చేయాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని.. దీనికి సంబంధించిన జీవోను నిలిపివేయాలంటూ.. రైతులు పిటిషన్‌లో కోరారు. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు రైతులు పక్కా సమాచారం సేకరించారు. ఏపీ పునర్విభజన చట్టానికి విరుద్ధంగా జీవో ఇచ్చారని.. ఏదైనా కృష్ణాబోర్డు ఆదేశాల మేరకే జరగాలని? కానీ తెలంగాణ సర్కార్ ఏకపక్షంగా జీవో ఇచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. ఏపీ ప్రభుత్వంతో పాటు కృష్ణాబోర్డు కూడా విద్యుత్ ఉత్పత్తి ఆపాలని కోరిందని.. వాటికి సంబంధించిన లేఖలను జత చేశారు. ఎటువంటి ఇరిగేషన్ అవసరం లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరుతో తెలంగాణ ప్రభుత్వం నీటిని వాడుకోవటం అన్యాయం అని పిటిషన్ లో ఆంధ్రప్రదేశ్ రైతులు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణలో తెలంగాణ హైకోర్టు ఏం చెబుతుందో కానీ.. రైతులు మాత్రం.. ఏపీ సర్కార్ ను నమ్ముకోవడం కన్నా.. తమ పోరాటం తాము చేయాలని నిర్ణయించుకోవడం.. ఆసక్తిరంగా మారింది. నీళ్లను కాపాడేందుకు ఏపీ సర్కార్ పరంగాఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. వాడుకుంటే వాడుకోనీ అన్నట్లుగా ఉన్నారు. గతంలో.. తెలంగాణ సరిహద్దుల్లో అంబులెన్స్‌లను నిలిపివేసినప్పుడు కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇతరులు పిటిషన్లు వేస్తే? ఇంప్లీడ్ అయింది. ఇప్పుడు.. రైతుల పిటిషన్‌లో ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో.. తమకు సంబధం లేనట్లుగా ఉంటుందో వేచి చూడాలి..!

# నూతన పన్ను విధానానికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రజాసంతకాల సేకరణ

*అరిగెల నాగేంద్ర సాయి*

నెల్లూరు జూలై 5 (న్యూస్ పల్స్) సింహపురి ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో మాగుంట లే అవుట్ లోగల అరిగెల ప్లాజా నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహపురి ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి మాట్లాడుతూ ,నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆస్థివిలువ ఆధారంగా నూతన పన్ను విధానాన్ని ప్రజలకు నష్టం కలిగించేలా ఉందని బిజెపి పాలిత రాష్ట్రాలే వ్యతిరేకత చూపిస్తుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం మోడీ మెప్పుకోసం ప్రజలమీద పన్నుల భారం మోవడానికి సిద్ధమయ్యారు.అందులో భాగంగా ఆస్థి విలువ ఆధారంగా పన్నులు వసూళ్ళ , చెత్త పన్ను , మరుగుదొడ్ల పన్ను ,యూజర్ చార్జీల పేరుతో ప్రజల మీద ఆర్థిక భారం మోపడానికి జిఓ 196,197,198 లను తీసుకురావడం జరిగింది. ఇప్పటికే కరోనా ప్రభావంతో ప్రజలంతా అప్పుల ఊబిలో మునిగిపోయి ఉన్నారు, వ్యాపరస్థులు , మధ్యతరగతి ప్రజలు , ఉద్యోగులు , కార్మికు లందరూ కూడా జీవనానికి సైతం అప్పులు చేసుకుంటున్నారు , కరోనా వలన కలిగిన నష్టాలకు అర్థిక ఉద్దీపనలు ఇవ్వవలసింది పోయి వారిని ఇలా పన్నులు ద్వారా దోపిడీ చేయాలనుకోవడం ఈ రాష్ట్రముఖ్యమంత్రి కి తగిన విధానం కాదని , ఈ నిర్ణయాన్ని ఉపశంహరించుకోవాలని సింహపురి టాక్స్పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యములో ఆస్థివిలువ ఆధారంగా పన్నులు వేయడాన్ని తాత్కాలికంగా 2 సంవత్సరాలు వాయిదా వేసి , అనంతరం వివిద రాజకీయ పార్టీలు , వాణిజ్య , వ్యాపార సంస్థలు , ప్రజాసంఘాల తో అఖిలపక్షం వేసి తద్వారా ప్రజాభిప్రాయ సేకరణచేసి తగిన మార్పులు , చేర్పులతో పన్నుల విధానం తీసుకురావాలని , జీఓ నెం 196 , 197 ,198 లను తక్షణమే ఉపసంహరించుకోవాలి . నెల్లూరు నగరం నుంచి లక్షమందితో నిరసన పత్రాలను వ్యక్తిగతంగా సేకరించి వాటిని స్థానిక వార్డు సచివాలయాల ద్వారా రాష్ట్రప్రభుత్వానికి పంపడానికి కార్యాచరణ తీసుకుని ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమం నగరంలో విస్తృతంగా చేపడుతున్నామని , అపార్ట్మెంట్ , నివాస గృహాలు , వ్యాపార సముదాయాలు ల యందు సింహపురి ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యములో కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ , మేము తయారు చేసిన నిరసన పత్రాల యందు సంతకాలు సేకరిస్తూ ,ఈ నెల 9 వ తేదీ న ఆ పత్రాలను తీసుకుని నెల్లూరు నగర మునిసిపల్ కమిషనర్కి పత్రాలను సమర్పించడం జరుగుతుందని , కావున ఈ కార్యక్రమానికిప్రజలందరూ సహకరించి నూతన పన్ను విధానాన్ని నిరసిస్తూ , సంతకాల ద్వారా మీ అందరి అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుకుంటున్నామని అన్నారు. ప్రపంచబ్యాంకు ఆదేశాలతో మోడీ ప్రజలను దోపిడీ చేస్తుంటే , జగన్ మోహన్ రెడ్డి మోడీ అదేశాలప్రకారం , ఇయని వ్యక్తిగత అవసరాల కోసం మోడీ చేపట్టే ప్రజా వ్యతిరేఖ విధానాలను బలపరుస్తు జాతి గౌరవాన్ని మోడీ పాదాలవద్ద తాకట్టు పెట్టడం సరికాదు , ప్రజలందరూ కూడా వీరి పాలనను గమనిస్తున్నారని తగినబుద్ధి చెప్పే సమయం ఆసన్నమయ్యిందని అన్నారు. ఈ సమావేశంలో వి.రామరాజు , వాటంబేటి నాగేంద్ర , ఆదినారాయణ , సునీల్ , న్యాయవాదులు ప్రత్యూష్ , అజయ్ కుమార్ , శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ వ్యర్థాలతో జరా భద్రం

హైద్రాబాద్, జూలై 5, (న్యూస్ పల్స్)కోవిడ్ వ్యర్థాలు వంద టన్నులు దాటాయి. ప్రపంచాన్ని గడగడలాడిస్తోన్న తరహాలోనే కోవిడ్ మహమ్మారి సోకిన రోగులు వాడిపడేసిన జీవ వ్యర్థాలు సైతం దడపుట్టిస్తున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా రోజుకు సుమారు ఒక టన్నుకు పైగానే ఈ వ్యర్థాలు ఉత్పన్నమౌతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, ప్రాంతాల్లోని 12 ప్రభుత్వ ఆస్పత్రులు, 128 క్వారంటైన్ కేంద్రాలు, 7 నమూనా సేకరణ కేంద్రాలు, 10 ల్యాబ్‌ల నుంచి నిత్యం కోవిడ్ జీవ వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని రాష్ట్రంలోని 11 కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ సెంటర్లకు తరలించి పర్యావరణానికి హాని కలగని రీతిలో నిర్వీర్యం చేస్తున్నారు. ఈ వ్యర్థాలను సేకరించేందుకు సుమారు 55 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయడం గమనార్హం. కోవిడ్ పంజా విసిరిన మార్చి 29 నుంచి జూన్ 22 వరకు సుమారు 100 టన్నుల వ్యర్థాలను సేకరించి ఆయా కేంద్రాలకు తరలించినట్లు పీసీబీ వర్గాలు తెలిపాయి. ఇందులో అత్యధికంగా గాంధీ ఆస్పత్రి నుంచి 50 టన్నుల జీవ వ్యర్థాలను సేకరించామన్నారు.కోవిడ్ సోకిన రోగులకు ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో వాడిన మాస్కులు, గ్లౌస్‌లు, దుస్తులు, మలమూత్రాలు, సిరంజిలు, కాటన్, పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్(పీపీఈ) కిట్లు, మెడిసిన్స్ కవర్స్ తదితరాలను కోవిడ్ వ్యర్థాలుగా పరిగణిస్తున్నారు. ఈ వ్యర్థాల పరిమాణం రోజురోజుకూ పెరుగుతూనే ఉండడం గమనార్హం. వీటిని నిర్లక్ష్యంగా ఇతర జీవ వ్యర్థాలతోపాటే పడవేస్తే వ్యాధి విజంభించే ప్రమాదం పొంచి ఉండడంతో పీసీబీ వర్గాలు,శుద్ధి కేంద్రాల నిర్వాహకులు వీటిని ప్రత్యేక శ్రద్ధతో సేకరించి జాగ్రత్తగా శుద్ధి కేంద్రాలకు తరలిస్తుండడం విశేషం.కోవిడ్ సోకిన రోగులతోపాటు వారు వాడి పడేసిన వ్యర్థాలను సైతం అంతే జాగ్రత్తగా శుద్ధి చేస్తున్నారు. ప్రధానంగా జీవ వ్యర్థాలను శుద్ధి చేసే కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ కేంద్రాలు మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట, నిజామాబాద్, వనపర్తి, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, యాదాద్రి జిల్లాల్లో 11 వరకు ఉన్నాయి. 55 ప్రత్యేక వాహనాల ద్వారా ఈ కేంద్రాలకు నిత్యం కోవిడ్ వ్యర్థాలు చేరుతున్నాయి. వీటిని రెండు విడతలుగా ప్రత్యేక యంత్రాల్లో కాల్చి బూడిద చేస్తున్నారు.

ఆ తర్వాత ఈ బూడిదను దుండిగల్‌లోని హజార్డస్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రానికి తరలించి అక్కడ బూడిదను మళ్లీ వివిధ రసాయనాలతో శుద్ధిచేసి ప్రత్యేక బాక్సుల్లో నిల్వచేసి భూమిలో అత్యంత లోతున పూడ్చివేస్తున్నారు.కోవిడ్ వ్యర్థాలను శుద్ధి చేస్తున్న 11 కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ కేంద్రాల్లో సుమారు 200 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వ్యర్థాల తరలింపు, శుద్ధిచేస్తున్న సుమారు 25 మందికి కోవిడ్ సోకినట్లు పీసీబీ వర్గాలు తెలిపాయి. వీరంతా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధి నిర్వహణలో ఉన్నందున తమకు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బందికి అందజేస్తున్న బీమా, ఇతర వసతులు కల్పించాలని ఆయా సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు

# 7న ముంపు మండలాల్లో నిరసన దీక్షలు: మధు



విజయవాడ: పోలవరం నిర్వాసితుల సమస్యను పరిష్కారం చేయకపోతే తాము జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమని సీపీఎం నేత మధు అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో మధు మాట్లాడుతూ..

15 రోజుల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని... లేకపోతే తమ ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇది రాజకీయ సమస్య కాదని...ప్రజా ఉద్యమమని అన్నారు. ప్రధానికి ఆంధ్ర అంటే చాలా చులకన భావం ఉందని తెలిపారు. 7న అన్ని ముంపు మండల కేంద్రాల్లో నిరసన దీక్షలు చేయనున్నట్లు మధు వెల్లడించారు.

# తెలంగాణకు యంగ్‌వన్ కార్పొరేషన్ భారీ విరాళం




హైదరాబాద్ : కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కొరియా కంపెనీ యంగ్‌వన్ కార్పొరేషన్ భారీ విరాళం ఇచ్చింది. 10 వేల రెమ్‌డిసివిర్ ఇంజెక్షన్లు, లక్ష కేఎన్95 మాస్కులను విరాళంగా ఇచ్చింది. జులై 1వ తేదీన 5 వేల డోసులు హైదరాబాద్‌కు రాగా, మిగతా డోసులను జులై 8 నాటికి పంపిణీ చేస్తామని యంగ్ వన్ కార్పొరేషన్ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున యంగ్ వన్ కార్పొరేషన్‌కు పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో కరోనా తగ్గుముఖం పట్టిందని, సెకండ్ వేవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొగలిగామని పేర్కొన్నారు. కరోనా తగ్గుముఖం పడుతుండటంతో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ఇండియాలోని తన అనుబంధ సంస్థ ఎవర్‌టాప్ టెక్స్‌టైల్, అపెరాల్ కాంప్లెక్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా యంగ్ వన్ కార్పొరేషన్ వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో 12 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టనుంది.

# ఆ విషయంపై జగన్‌రెడ్డి కేసీఆర్‌కి ప్రేమలేఖలు రాస్తున్నారు: జవహర్



అమరావతి: కృష్ణా జలాల్లో అర్థభాగం తమవేనని కేసీఆర్ అంటుంటే, జగన్మోహన్‌రెడ్డిమో ప్రేమలేఖలు రాస్తున్నారని తెలుగుదేశం సీనియర్ నేత, మాజీమంత్రి కే.ఎస్.జవహర్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్– జగన్మోహన్‌రెడ్డిల అన్నదమ్ముల అనుబంధం ఏపీ రైతాంగానికి శాపంగా మారిందని జవహర్ ధ్వజమెత్తారు. ఢిల్లీ వెళ్లి బతిమాలినా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, జగన్మోహన్‌రెడ్డికి అపాయింట్ మెంట్ ఇవ్వలేదన్నారు. ఈ ముఖ్యమంత్రేమో ఆయనకు లేఖ రాశానని, సమస్య పరిష్కారమవుతుందని చెపుతున్నారన్నారు. జగన్ తనపై ఉన్నకేసులకు భయపడి, ఏపీ రైతాంగ ప్రయోజనాలను కేసీఆర్‌కు, ఢిల్లీపెద్దలకు తాకట్టు పెట్టేశారని జవహర్ మండిపడ్డారు.ముఖ్యమంత్రి మోనం వీడకుంటే రాష్ట్ర రైతాంగం క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదముందని జవహర్ హెచ్చరించారు. ఇప్పటికే సాగునీటి సరఫరాలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ.. ముమ్మిడివరం మండలంలో 800ఎకరాల్లో క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. రబీ ప్రారంభమైన రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, పంటల బీమాపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని జవహర్ చెప్పారు. వ్యవసాయమంత్రేమో విశాఖలో భూకబ్జాలకు పరిమితమయ్యారన్నారు. వ్యవసాయ అధికారులేమో ప్రజాప్రతినిధుల సేవల్లో తరిస్తున్నారని జవహర్ దుయ్యబట్టారు.

# కులం పేరుతో గ్రామ వాలంటీర్‌కు వేధింపులు..

విశాఖ: జిల్లాలో కులం పేరుతో వేధింపులకు గురైన ఓ దళిత గ్రామ వాలంటీర్ న్యాయం కోసం జిల్లా ఎస్పీని కలిసింది. కులం పేరుతో తనను కొందరు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ‘కులం, మతం, ప్రాంతం చూడంవ ఇది ముఖ్యమంత్రి జగన్ నినాదం. కానీ కొంతమంది వైసీపీ నేతలు దీన్ని ఉల్లంఘిస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలోని ఉమ్మవారం గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తున్న వనజ అనే ఓ దళిత యువతి కుల వివక్షకు గురౌతోంది. కులం పేరుతో గ్రామ సర్పంచ్, ఇతర పెద్దలు వేధింపులకు గురి చేస్తున్నారని వనజ ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే సహ వాలంటీర్ సాయి అనే యువకుడు సర్వే పేరుతో తన ఫోన్ తీసుకుని అసభ్యంగా వేధించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.



# విద్యార్థులకు ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ

## ఎన్ ఎస్ యు ఐ డిమాండ్

ఎమ్మిగనూరు జూలై 5, (( విభారె) పట్టణంలో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన మహమ్మారి కరోన కేసులు తగ్గుతున్న దృష్ట్యా ప్రతి విద్యార్థికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ చేసిన తర్వాతే విద్యా సంస్థలను, ప్రవేశ ,ఇతర పరీక్షలను ప్రారంభించాలని, ఎన్ఎస్యుఐ జాతీయ అధ్యక్షుడు నీరజ్ కుందన్, జాతీయ కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ నాగేష్ కరియప్ప, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు నాగ మధు యాదవ్ పిలుపుమేరకు సోమవారం ఎమ్మిగనూరు స్థానిక కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వసతి గృహాల రాష్ట్ర కన్వీనర్ వీరేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి వెంటనే వ్యాక్సిన్ ఇచ్చేందుకు ప్రభుత్వాలు ఏర్పాట్లు చేయాలని, కరోనా వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాతే కాంపిటేటివ్ ప్రవేశ ఇతర పరీక్షలు నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. పది ఇంటర్ సీబీఎస్ఈ పరీక్షలు రద్దు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ గారు ప్రస్తుతం సంభవిస్తున్న థర్డ్ వే కరోన, డెల్టా ప్లస్ మరియు ఇతర వ్యాధి లు విద్యార్థులకు సంభవించకుండా ఉ ండేందుకు ప్రత్యేక చికిత్స, మందులు, వ్యాక్సిన్ లపై దృష్టి సారించాలన్నారు. వ్యాక్సిన్ వేయకుండా విద్యా సంస్థలను ప్రారంభించడం, ప్రవేశ మరియు ఇతర విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని, దీనిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకొని వ్యాక్సిన్ వేసిన తర్వాతే పలు నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ స్థాయి పిలుపుమేరకు దేశ వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు షేక్షావలి, సుధాకర్ ,దివాకర్, మనోజ్,అనంత కుమార్ ,హనుమంతు పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలి

నెల్లూరు జూలై 5, (( విభారె)ప్రభుత్వ పథకాలు వర్తించు లాగున మాకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని స్థానిక నారాయణ రెడ్డి పేట చేనేత కార్మికులు జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే లను వేడుకున్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

## నారాయణరెడ్డి పేట చేనేత కుటుంబికుల వేడుకోలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని నారాయణ రెడ్డి పేట, ద్వారకా నగర్ సచివాలయం-1 పరిధిలోని చేనేత వృత్తి పై జీవనాధారం సాగిస్తున్న మమ్మల్ని ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కష్టార్జితంతో కొనుక్కున్న సొంత స్థలాలలో 2018 -19 సంవత్సరంలో పి ఎం ఏ వై పథకం ద్వారా ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. చేపట్టిన గృహ నిర్మాణాలు ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన కారణంగా కెన్ ఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రైవేటు బ్యాంకుల నుండి లోన్లు తీసుకొని గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఈ క్రమంలో లోన్లు తీసుకున్న సమయంలో ఐటీ రిటర్న్ చేసుకోవడంతో ప్రస్తుతం మాకు రేషన్ కార్డులు లేకుండా చేయడం జరిగిందని తమ ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కారణంగా చేనేత ఇతర కూలి పనుల పై ఆధారపడి జీవిస్తున్న మా కుటుంబాలలోని పిల్లలకు అమ్మ ఒడి, ఫీజు రియంబర్స్మెంట్, చేనేత నేస్తం తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొంద లేకున్నామని తమ మనోవేదనను ప్రభుత్వానికి వినిపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక శాసనసభ్యులు స్పందించి, సదరు విషయమై విచారణ చేపట్టి పేద కుటుంబీకుల మైన మాకు రేషన్ కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో బాధితులు మద్దిలి రాజు, కామాక్షి, సుంద రామారావు, మామిడి రాము, గౌరమ్మ ,కల్లూరు అప్పలరాజు, పావని, ఇమంకీ వెంకన్న, లక్ష్మి, సోదా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలి

### మండల అధికార ప్రతినిధిరాహుల్ సాగర్

ఎమ్మిగనూర్ జూలై 5, (( విభారె)పట్టణంలోని స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నందు పత్రిక విలేకరులు సమావేశంలో జనసేన పార్టీ మండల అధికార ప్రతినిధి రాహుల్ సాగర్ మాట్లాడుతూ ×రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను రద్దు చేసి, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉ న్న 2 లక్షల 34 వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం అయితే నేమి ఇప్పుడు నడుస్తున్న వైసీపీ ప్రభుత్వం అయితేనేమి నిరుద్యోగులను కేవలం ఓట్ల కొరకు వాడుకుంటున్నారని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరుద్యోగులకు సరైన న్యాయం చేయడం లేదని ధ్వజ మెత్తారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై దృష్టి సారించి ప్రభుత్వ రంగానికి సంబంధించి ఉపాధ్యాయులు పోస్టు అయితే నేమి పోలీస్ శాఖ కి సంబంధం పెట్టిన పోస్టు అయితే నేమి భర్తీ చేయాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో రవి ప్రకాష్ షబ్బీర్ రమేష్ శివ తదితరులు పాల్గొన్నారు

# ఈ మూడు అలవాట్లు మీ తల్లిని ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉండేలా చేయగలవు




హైదరాబాద్, ): దేవుడు ప్రతిచోటా ఉండలేక అమ్మని స ృష్టించాడు అంటారు. నిజమే, ప్రేమకి స్వచ్ఛమైన రూపంలా ప్రతిబింబిస్తుంది అమ్మ. తల్లి విలువ తెలిసిన ప్రతిఒక్కరికీ తల్లిప్రేమ విలువ తెలుస్తుంది. తల్లి అంటేనే ఒక అద్భుతం, కుటుంబానికి వెన్నెముకలా ఉంటూ, అందరి సంరక్షణకు బాధ్యత వహించే నిస్వార్ధ జీవి అమ్మ.ఈ ప్రపంచమంతా మనల్ని విడిచినా, మన చేయి వదలకుండా మనకు మద్దతునిచ్చే ఒకే ఒక వ్యక్తి అమ్మ. ఆమె ఉ దారత, సంరక్షణ, ఆప్యాయత, క్షమాగుణం ఏ ఇతర వ్యక్తితోనూ సరితూగదు. ఒక తల్లి ప్రేమను నిర్వచించడం ఎంతటి వారికైనా ఒక సవాలుగానే ఉ ంటుంది. ప్రతి ఒక్కరి వ్యక్తిగత అవసరాలను నిరంతరం గమనిస్తూ, తనవారికోసం, ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడే అమ్మ అనిర్వచనీయం. అటువంటి అమ్మను జీవితాంతం సంతోషంగా చూసుకోవలసిన బాధ్యత మనమీద ఉంటుంది. అవునా? కొన్నిరోజుల క్రితం, ప్రపంచ తల్లుల దినోత్సవం నాడు మంచిమంచి కాప్షన్లతో కూడిన చిత్రాలు, కొటేషన్లు, శీర్షికలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ, వారివారి తల్లుల మీద ఉ న్న ప్రేమను ప్రపంచంతో పంచుకోవడం అందరమూ చూశాము. కానీ మిగిలిన సంవత్సరమంతా అదే ప్రేమను కొనసాగిస్తున్నారా? లేదా కేవలం సోషల్ మీడియాలో లైకులు, షేర్ల కోసమే అన్నట్లు పోస్ట్ చేశారా? ఇక్కడ ఎవరినీ కించపరచడం లేదు. తల్లులను గుండెలలో పెట్టుకుని చూసే పిల్లలు ఉన్నట్లే, వారిని నిరంతరం తమచేష్టలతో భాదపెట్టే వారు కూడా ఈ ప్రపంచంలో సర్వసాధారణం. మారుతూ ఉన్న టెక్ ప్రపంచం కారణంగా పక్కన చేరి, బాగోగులు అడగాల్సిన వారు ఎప్పుడో కానీ, మెసేజ్ లేదా కాల్స్ ద్వారా చుట్టపు చూపుగా పలకరిస్తూ సంబంధాల ఉనికినే ప్రశ్నార్ధకం చేస్తున్నారు అన్నది వాస్తవం. ఆమెకు ఖరీదైన బహుమతులను ఇవ్వడానికి బదులుగా, ఇక్కడ చెప్పబడిన మూడు అలవాట్లను పాటిస్తున్నారేమో గమనిస్తూ ఉండండి. ఈ మూడు అలవాట్లు, ఆమెను సంతోషంగా, ఆరోగ్యంగా ఉ ండేందుకు దోహదం చేస్తాయి. 1. పోషకాహారాన్ని తీసుకోవడం:తల్లి, వారి పిల్లలు తినగా మిగిలిపోయిన ఆహారాన్ని తినే అలవాటును కలిగి ఉంటుంది. దీనికి కారణం, ఆమె ఆహారాన్ని వ ృథాచేయటానికి ఇష్టపడకపోవడమే. మరియు కష్టపడి సంపాదించినది అన్న భావన. ఇలా పిల్లలు తినగా మిగిలిన బర్గర్/పాన్కేక్ వంటి ఆహారాలను తరచుగా తీసుకోవడం కారణంగా, శరీరంలో అదనపు కేలరీలు పేరుకొనిపోయే ప్రమాదం ఉంది. క్రమంగా ఇది ఊబకాయానికి దారితీయవచ్చు.మీ పిల్లలు తినే తీరు, పరిమాణం వయసు ద ృష్ట్యా మారుతుందని గ్రహించడం అత్యవసరం. పసిపిల్లలకు కొంత సమయం విరామం ఇచ్చిన తర్వాత భోజనం అవసరం ఉండవచ్చు, కానీ పెద్దలలో, జీర్ణవ్యవస్థ భిన్నంగా ఉన్న కారణాన, ప్రతి రెండు-మూడు గంటలకు ఒకసారి ఆహారాన్ని తీసుకోవలసిన అవసరం ఉండదు. కావున తీసుకునే ఆహారం మీద శ్రద్ధ ఉంచడం అవసరం.అంతేకాక, అధిక పనిఒత్తిడి కారణంగా మహిళల్లో అనేకమంది తరచుగా ఆహారాన్ని మరచిపోవడం, లేదా స్కిప్ చేయడం చేస్తుంటారు. సంవత్సరాలుగా, ఈ నిర్లక్ష్యం కొనసాగడం మూలంగా శరీరంలో అత్యంత ముఖ్యమైన పోషకలోపాలకు దారితీస్తుంది. శరీరం ఆరోగ్యకరమైన జీవక్రియలను కలిగి ఉండాలంటే, మన శరీరంలో తగినంత ప్రోటీన్ ఉండటం అవసరం. కావున, మహిళలు వర్కింగ్ ఉమెన్ అయినా, గ ృహిణిగా ఉన్నా, బ్రొకోలీ, బాదం, గుడ్డు, కాటేజ్ చీజ్, చికెన్ బ్రెస్ట్, లీన్ బీఫ్, చేపలు, క్వినోయా మరియు వోట్మీల్ వంటి ప్రోటీన్ ఆధారిత ఆహారాలను తరచుగా తీసుకునేలా జాగ్రత్త వహించాలి. దైనందిక జీవనచర్యలలో బిజీషెడ్యూల్ నిమిత్తం, వ్యాయామానికి సమయం కేటాయించలేని స్థితిలో ఉంటూ ఉంటారు. కానీ ఒక ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే, జీవనశైలికి సరిపోయేలా, మరియు శరీరం క్రియాశీలకంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరిగా ఉంటుంది. వ్యాయామశాలకు వెళ్ళే సమయం లేనిపక్షంలో, ఇంటిలోనే కాస్త సమయం కేటాయించి కొన్ని వ్యాయామ పద్ధతులను అనుసరించడం మేలు. మానసిక ప్రశాంతత కూడా అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటిగా ఉంటుంది. తరచుగా మన తల్లులు, నిద్రలో ఉలికిపాట్లకు గురవడం లేదా, చిన్నచిన్న విషయాలకే టెన్షన్ గురవడం వంటివి చూస్తూనే ఉంటాం.

## రవిశాస్త్ర సక్సెస్ అవుతుంటే.. ద్రవిడ్ ఎందుకు?

ముంబై: ఇండియన్ టీమ్ హెడ్ కోచ్ పదవిపై మరోసారి చర్చ మొదలైంది. టీమిండియా సీనియర్ టీమ్ ఇంగ్లండ్ టూర్లో ఉండగానే మరో టీమ్ను రెడీ చేసి బీసీసీఐ శ్రీలంకకు పంపించడం, దానికి రాహుల్ ద్రవిడ్ను కోచ్గా నియమించడంతో ఈ చర్చకు తెరలేపినట్లయింది. ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్గా ఉన్న రవిశాస్త్ర పదవీకాలం టీ20 వరల్డ్కప్తో ముగియనుంది. దీంతో అతని తర్వాత కోచ్ రేసులో ద్రవిడ్ ఉన్నాడని బీసీసీఐ ఇలా చెప్పకనే చెప్పిందన్న విశ్లేషణలు వినిపించాయి. అయితే టీమిండియా వరల్డ్కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఈ విషయం గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని అనుకుంటున్నా. ఈ శ్రీలంక సిరీస్ అయితే పూర్తి కానివ్వండి. మన టీమ్ ప్రదర్శన ఎలా ఉందో తెలుస్తుంది

# 100 సినిమాలు తీసే కేరళకు ప్రభుత్వ ఓటీటీ! 250 సినిమాలు తీసే టాలీవుడ్ కి!?




బాహుబలి ముందు బాహుబలి తర్వాత ఎలానో సినీఇండస్ట్రీల్ని బహుశా కరోనా ముందు కరోనా తర్వాత అని విభజించాలి. ఇప్పుడంతా ఓటీటీల యుగం నడుస్తోంది. ఓటీటీ పరిధి అంతకంతకు విస్తరిస్తోంది. కార్పొరెట్ కంపెనీల ఓటీటీలు ప్రబలంగా ఉండగానే కొందరు సినీ నిర్మాతలు సొంత ఓటీటీలతో సిద్ధమవుతున్నారు. మరికొందరు హీరోలు ఈ రంగంలో ప్రవేశిస్తూ వేడి పెంచేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల తమిళ నిర్మాతల మండలి సొంత ఓటీటీకి ప్రయత్నించడం హాట్ టాపిక్ అయ్యింది. అయితే ఈ పరిధి ఇంతటితో ఆగిపోడం లేదు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వాలే సొంత ఓటీటీని ప్రారంభించి చిన్న సినిమాలను క్రియేటివిటీని కాపాడేందుకు ప్రయత్నిస్తుండడం సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది.తాజాగా కేరళ ప్రభుత్వం సొంత ఋ ప్లాట్ ఫామ్ ను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ఆ రాష్ట్ర మంత్రివర్యులు ప్రకటించారు. కళాత్మక విలువలు కలిగిన చిత్రాలను ప్రజల్లోకి తీసుకురావడమే లక్ష్యంగాచిన్న సినిమాలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఓవర్ ది టాప్ (ఓటిటి) ప్లాట్ ఫామ్ ను ప్రారంభించాలని లేదా ఇప్పటికే ఉన్న ప్లాట్ ఫామ్ తో కలిసి ఒక ఓటీటీని అమలు చేయాలని యోచిస్తున్నట్లు సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సాజీ చెరియన్ తెలిపారు.కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (కెయుడబ్ల్యుజె) - కేసరి మెమోరియల్ జర్నలిస్ట్స్ ట్రస్ట్ ఇటీవల నిర్వహించిన మీట్-ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ అన్ని రకాల కళాత్మక విలువలను ప్రజల ముందుకు తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని చెరియన్ అన్నారు. .ఓటీటీ ప్లాట్ ఫామ్ ను సొంతంగా ప్రారంభించే అవకాశాన్ని లేదా ఇప్పటికే ఉన్న ప్లాట్ ఫాం సేవలను అద్దెకు తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. సాంస్కృతిక శాఖ కార్యదర్శి కేరళ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే బాధ్యత ఇచ్చామని మంత్రి వర్యులు అన్నారు.ప్రస్తుత కోవిడ్ పరిస్థితిలో చిన్న బడ్జెట్ చిత్రాలకు ప్రేక్షకులను కనుగొనడంలో సహాయపడటానికి ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఋ వేదిక ముఖ్యం. ఇప్పటికే థియేట్రికల్ రన్ పూర్తయిన పెద్ద బడ్జెట్ చిత్రాలు కూడా ఈ వేదికపైకి రావచ్చు అని మిస్టర్ చెరియన్ అన్నారు. కేరళలోని చిత్రంజలి స్టూడియోను అన్ని రకాల చిత్రాలను చిత్రీకరించడానికి సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల ప్రాజెక్టును చేపట్టనున్నామన్నారు. ఇది పోస్ట్ ప్రొడక్షన్ హబ్ గా కూడా మారుతుంది. టెలివిజన్ సీరియల్స్ కళాత్మక విలువను మెరుగుపరచడానికి కొంత రకమైన జోక్యం అవసరమని మిస్టర్ చెరియన్ అన్నారు. ఇవి ప్రేక్షకులలో ఒక విభాగానికి మాత్రమే పరిమితం కాలేదు. వాటిని అన్ని రకాల ప్రేక్షకులను ఆకర్షించేలా మార్చాలి.నాటకాలు- స్టేజ్ షోలతో సహా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఆన్ లైన్ ప్లాట్ ఫాంను ప్రారంభించాలని అన్నారు. సాంస్కృతిక అకాడమీలు కమిటీల పనితీరు మెరుగుపడుతుంది. మతతత్వం-కులతత్వం -వరకట్నంతో సహా తిరోగమన ధోరణులను ఎదుర్కోవడానికి సాంస్కృతిక శాఖ కూడా ప్రధానంగా జోక్యం చేసుకుంటుందని మంత్రివర్యులు వివరించారు.నిజానికి ఇది ఎంతో గొప్ప నిర్ణయం. ఆహ్వానించదగిన పరిణామం. కేరళ ప్రభుత్వ నిర్ణయం నిజంగానే ఒక మేలుకొలుపు అని చెప్పాలి. ఇతర పరిశ్రమలు ఇదే మార్గాన్ని అనుసరించేలా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఒక మంచి నిర్ణయం తీసుకోవాలనే ఆకాంక్షిద్దాం.యేడాదికి దాదాపు 100 సినిమాలు మాత్రమే తెరకెక్కించే కేరళలో ప్రభుత్వం ఇంత మంచి నిర్ణయం తీసుకుంటే ఏడాదికి సుమారు 200-250 చిత్రాలు తెరకెక్కించే టాలీవుడ్ కోసం తెలుగు ప్రభుత్వాలు ఏమీ చేయలేవా? అందుకే కేసీఆర్ - వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు ఆ దిశగా సృజనాత్మక అడుగులు వేస్తాయని చిన్న సినిమాని బతికిస్తాయని కళాకారులు ఆకాంక్షిస్తున్నారు.

# ఎన్టీఆర్ సినిమాలో బాలీవుడ్ స్టార్స్..!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ మల్టీస్టారర్ 'ఆర్.ఆర్.ఆర్' లో నటిస్తున్నారు. దీని తర్వాత తారక్ చేయబోయే మరో రెండు ప్రాజెక్ట్స్ కు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. వాటిలో కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న పాన్ ఇండియా మూవీ కూడా ఉంది.'జనతా గ్యారేజ్' వంటి సూపర్ హిట్ తర్వాత వీరి కాంబోలో వస్తున్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం కొరటాల శివ ఔఖీ30 చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నారు. తనదైన శైలిలో సామాజిక అంశాలు - కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండేలా దర్శకుడు ఈ స్టోరీ రెడీ చేస్తున్నారట. అది కూడా స్టూడెంట్ పాలిటిక్స్ నేపథ్యంలో ఉంటుందని టాక్.అలానే పాన్ ఇండియా స్థాయిలో రూపొందే సినిమా కాబట్టి పలువురు బాలీవుడ్ స్టార్స్ ని తీసుకోనున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో 'భరత్ అనే నేను' సినిమాతో తాను టాలీవుడ్ కు పరిచయం చేసిన ఉత్తరాది భామ కియారా అద్వానీ ని హీరోయిన్ గా ఫైనలైజ్ చేశారని వార్తలు వస్తున్నాయి. దీని కోసం కియరా కు భారీ రెమ్యూనరేషన్ ఇస్తున్నారట.అంతేకాదు ఈ చిత్రంలోని ఓ కీలక పాత్ర కోసం ఓ బాలీవుడ్ స్టార్ యాక్టర్ ని సంప్రదిస్తున్నారని సమాచారం. అయితే ఆ నటుడు ఎవరనేది తెలియలేదు. రాబోయే రోజుల్లో దీనిపై క్లారిటీ వస్తుంది. ఇకపోతే తమిళ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి వర్క్ చేయనున్నాడని తెలుస్తోంది. దీనికి 'సెన్సేషనల్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది.నందమూరి కళ్యాణ్ రామ్ ఎన్టీఆర్ ఆర్ట్స్ సమర్పణలో యువసుధ ఆర్ట్స్ బ్యానర్ పై మిక్కిలినేని సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'ఆర్.ఆర్.ఆర్' సినిమా పూర్తయిన తర్వాత ఔఖీ30 ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుంది. ఇదే క్రమంలో 'కె.జి.యఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తో తారక్ ఓ పాన్ ఇండియా మూవీ చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఈ సినిమా రూపొందుతుంది.



# మెగాస్టార్ స్టార్ట్ చేస్తే మూడు గుమ్మడి కాయలు కొట్టే వరకు నో బ్రేక్!



కరోనా కారణంగా ఎన్నో సినిమా లు బాక్సాఫీస్ వద్దకు రావాల్సి ఉన్నా ఆగిపోయాయి. గత ఏడాది అనుకున్న సినిమాలను ఈ సమ్మర్ లో విడుదల చేసేందుకు ప్రయత్నించారు. కాని సెకండ్ వేవ్ వల్ల టాలీవుడ్ కు చెందిన పదుల కొద్ది సినిమా లు వాయిదా పడ్డాయి. అందులో మెగా స్టార్ చిరంజీవి ఆచార్య సినిమా కూడా ఉంది. చిరంజీవి తో పాటు రామ్ చరణ్ కూడా ఆచార్య లో నటించడంతో పాటు ఇప్పటి వరకు ఫ్లాప్ అనేది తెలియని దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలో సినిమా తెరకెక్కడం వల్ల అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. కొరటాల శివ ఈ సినిమా ను కేవలం మూడు నెలల్లోనే పూర్తి చేసి గత ఏడాది ఆగస్టులో విడుదల చేయాలనుకున్నాడు. కాని కరోనా ఆయన ప్లాన్స్ పూర్తిగా రివర్స్ అయ్యేలా చేసింది.సమ్మర్ కు ముందు ఈ సినిమా పూర్తి అవ్వాల్సి ఉన్నా కూడా కరోనా బారిన విలన్ సోనూసూద్ పడటంతో షూటింగ్ కు బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత లాక్ డౌన్ కారణంగా కూడా షూటింగ్ జరగలేదు. మరో వారం పది రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలన్స్ ఉండగా ఎప్పుడెప్పుడు మొదలు పెడతారా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆచార్య సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే పునః ప్రారంభం కాబోతుంది. ఆచార్య కోసం నాలుగు అయిదు రోజుల పాటు చిరంజీవి షూటింగ్ లో పాల్గొనబోతున్నాడట. ఆ తర్వాత షూటింగ్ కు బ్రేక్ ఇవ్వకుండా వెంటనే మోహన్ రాజా దర్శకత్వంలో లూసీఫర్ రీమేక్ ను మొదలు పెట్టబోతున్నట్లుగా తెలుస్తోంది.లూసీఫర్ ఇప్పటికే చాలా నెలలుగా వాయిదాలు పడుతూ వస్తోంది. కనుక ఖచ్చితంగా ఈసారి లూసీఫర్ ను పూర్తి చేసి తీరాలని భావిస్తున్నాడు. ఈ లూసీఫర్ ను కూడా రెండు నుండి మూడు నెలల్లోనే పూర్తి చేయాల్సిందిగా దర్శకుడికి చిరంజీవి చెప్పాడట. ఆచార్య కు గుమ్మడి కాయ కొట్టడమే ఆలస్యం వెంటనే లూసీఫర్ ను మొదలు పెట్టి గుమ్మడి కాయ కొట్టే వరకు బ్రేక్ తీసుకోవద్దని నిర్ణయించుకున్నాడట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం లూసీఫర్ తో పాటు మరో సినిమా ను కూడా చిరంజీవి మొదలు పెట్టబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అది వేదాళం రీమేక్ అయ్యి ఉండవచ్చే లేదంటే బాబీ దర్శకత్వం లో రూపొందబోతున్న సినిమా అయినా అయ్యి ఉండవచ్చు అంటున్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190